శనివారం
05-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 133
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఐరాసలో క్యూబాకు అపూర్వ మద్దతు

అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో గురువారం క్యూబాకు నూతన విజయం చేకూరింది. ఐక్యరాజ్య సమితిలో క్యూబాకు అనుకూలంగా తీర్మానం 180 ఓట్లతో ఆమోదించటంతో క్యూబా అత్యధిక మద్దతు సాధించింది.

2లో

మార్చిలో హైకోర్టు తీర్పిస్తే ఇప్పుడు

అత్యవసర విచారణా?

జగన్ సర్కార్‌కు సుప్రీం కీలక ప్రశ్న

- పిటిషన్లన్నీ పరిశీలించాకే విచారణ చేపడతాం
- 14వ తేదీకి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఏపీ రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జగన్ సర్కార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీజేఐ ధర్మాసనం నుంచి మరో ధర్మాసనానికి మారిన ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ధర్మాసనం కార్యకలాపాలు ముగియనుండటంతో పిటిషన్లపై విచారణ చేపట్టే విషయాన్ని రైతుల తరపు న్యాయవాదులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయితే పిటిషన్లను పరిశీలించకుండా, కేసు వివరాలు తెలుసుకోకుండా విచారణ చేపట్టలేమని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. తమ వద్దకు వచ్చిన పిటిషన్లను పరిశీలించిన తర్వాతే వాదనలు వింటామని, అప్పటివరకు వేచి ఉండాలని ధర్మాసనం సూచించింది. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని, వాయిదా వేయకుండా విచారణ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది కోరారు. దీనిపై జస్టిస్ కేఎం జోసెఫ్ అభ్యంతరం తెలియజేస్తూ ఏపీ ప్రభుత్వానికి కీలక ప్రశ్న వేశారు. అమరావతిపై మార్చిలో హైకోర్టు తీర్పు ఇస్తే సెప్టెంబరులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్‌ఎల్పీ) ఎందుకు దాఖలు చేశారని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డిని నిలదీశారు. అమరావతి పిటిషన్లను

- మిగతా 2 లో

స్ఫూర్తిదాయకం

- జనాదరణతో జాతీయ మహాసభలు జయప్రదం
- సీపీఐ శ్రేణుల్లో ఉత్తేజం నింపిన మహా ప్రదర్శన
- మూడుసార్లు ఆతిథ్యమిచ్చి చరిత్ర సృష్టించిన విజయవాడ
- పార్టీ బలోపేతానికి అంకితమవుదాం
- ఆహ్వానసంఘం ముగింపు సమావేశంలో రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న సీపీఐకి జనాదరణ మెండుగా ఉన్నట్లు అక్టోబరు14నుండి 18వ తేదీ వరకు విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగసభలు నిరూపించాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. స్థానిక దాసరి భవన్‌లో శుక్రవారం సీపీఐ జాతీయ మహాసభల ఆహ్వానసంఘ ముగింపు సమావేశం నిర్వహించారు. ఆహ్వానసంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా మాట్లాడుతూ విజయవాడలో జరిగిన జాతీయ మహాసభలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. మహాసభల ఏర్పాట్లు అద్భుతంగా చేశారని, ఇందుకోసం ఏర్పాటైన కమిటీలన్నీ అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించాయని కొనియాడారు. ప్రతినిధులకు వసతి, భోజన సౌకర్యాలు, మహాసభల ప్రాంగణంలో ఏర్పాట్లు, వేదిక నిర్మాణం వంటివి అంతర్జాతీయ మహాసభలకు మించి ఉన్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా మహాసభల సందర్భంగా నిర్వహించిన మహాప్రదర్శన, బహిరంగసభకు పార్టీ శ్రేణులను భారీస్థాయిలో కదిలించడంలో ఏపీ, తెలంగాణ పార్టీలు చేసిన కృషి అభినందనీయమన్నారు. పార్టీ చరిత్రలో జాతీయ మహాసభల నిర్వహణకు మూడుసార్లు ఆతిథ్యమిచ్చిన ఘనత విజయవాడ నగరానికే దక్కిందన్నారు. ఈ స్ఫూర్తితో మరింత పటిష్ఠ ఉద్యమాలు నిర్మించి, పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మహాసభల విజయవంతానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన, వారందించిన సహకారం మరువలేనిదన్నారు. ధన, వస్తు రూపేణా అనేకమంది స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారని, వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మహాసభల సందర్భంగా అక్టోబరు 14వ తేదీన నిర్వహించిన మహా ప్రదర్శనకు ప్రత్యేక రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల ద్వారా జనం ఉప్పెనలా తరలిరావడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిందన్నారు. ఈ ప్రదర్శన ద్వారా పేదలు సీపీఐ వెనుకే ఉన్నారని మరోసారి నిరూపితమైందన్నారు. ఏపీలోని 26 జిల్లాల నుంచి దాదాపు 48వేల మంది పార్టీ, అనుబంధ సంఘాల కార్యకర్తలు, 2వేల మంది రెడ్‌షర్ట్ వలంటీర్లు ప్రదర్శనకు తరలిరాగా, తెలంగాణ నుంచి సుమారు 25వేల మంది తరలివచ్చినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా 17 దేశాలకు చెందిన ప్రతినిధులు మహాసభలకు హాజరుకావడం మరో విశేషంగా పేర్కొన్నారు. మహాసభల విజయవంతం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు, ఆహ్వానసంఘ సభ్యులంతా అత్యంత సమర్థవంతంగా పనిచేశారని పేర్కొంటూ

- మిగతా 2 లో

అక్టోబరు సోషలిస్టు విప్లవ దినోత్సవం...

7న వాడవాడలా సభలు

8లో

| సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు | ప్రారంభమైన సమితి సమావేశాలు

వలసలతో ఊళ్లు ఖాళీ

- పనుల కోసం పొరుగు రాష్ట్రాలకు పరుగు
- ఉపాధి పనులూ చూపని ప్రభుత్వం
- చదువుకు చిన్నారులు దూరం
- పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు/కోసిగి: వలసలకు అడ్డుకట్టవేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పాలకులు పదేపదే చెబుతుంటారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షింగా ఉన్నట్లు గొప్పలు పోతారు. కానీ చేయడానికి పనిలేక...సాగుకు సదుపాయాలు లేక రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కూలీలు ఊరుకాని ఊరుకు బతుకు తెరువు కోసం వలసబాట పడుతున్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలతో ఊళ్లన్నీ ఖాళీ అవుతున్నాయి. ఏ గడపకి వెళ్లినా తాళాలే దర్శనమిస్తున్నాయి. ఇంటి వద్ద వృద్ధులను కాపలా పెట్టి పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. అతివృష్టి, అనావృష్టితో వరుస కరువులు రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా చేస్తున్నాయి. పంటలకు పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. ఇక చేయగలిగేది లేక ప్రజలు వలసబాట పడుతున్నారు.

కర్నూలు జిల్లాలోని కృష్ణగిరి, పెద్దకడుబూరు, మంత్రాలయం, కౌతాళం, పత్తికొండ, వెల్దుర్తి, ఆలూరు, చిప్పగిరి, నంద్యాల జిల్లా ప్యాపిలి, డోన్ మండలాల నుండి రోజూ వందలాది మంది మూట ముల్లె సర్దుకుని వలస పోతున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లా కోసిగి మండలంలో ఏ పల్లెను చూసినా నిర్మానుష్యమే. గ్రామాలు కళతప్పి బోసిపోయాయి. కోసిగితో పాటు చింతకుంట, పల్లెపాడు, దుద్ది, కోల్మన్‌పేట, చిర్తనకల్, సజ్జలగూడెం, డి.బెళగల్, నేలకోసిగి, వందగల్లు తదితర గ్రామాలన్నీ ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి, మిరప తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటల కోసం తెచ్చిన అప్పులు తీర్చడానికి పిల్లాపాపతో సహా సుదూర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని వెళుతున్నారు. చదువుకునే పిల్లలను సైతం వెంట తీసుకెళ్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కోసిగి మండలం వలసలకు మొదటి స్థానంలో నిలిచింది. అక్షరాస్యతలోనూ వెనుకబడి ఉంది. అక్టోబర్ ప్రారంభం నుంచి మండలంలో వలసలు ప్రారంభమవుతాయి. ఎక్కువగా బెంగళూరు, హైదరాబాదు, ముంబై తదితర ప్రాంతాలకు వలస

- మిగతా 2 లో

చంద్రబాబుపై దాడికి యత్నం

- భద్రతాధికారికి గాయం
- నందిగామలో ఉద్రిక్తత

గాయపడిన మధు

విశాలాంధ్ర–నందిగామ: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఎన్టీఆర్ జిల్లా నందిగామ పర్యటనలో ఉద్రిక్తత నెలకొంది. 'బాదుడే బాదుడు' నిరసన రోడ్‌షో నిర్వహిస్తున్న సమయంలో చంద్రబాబుపై గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరాడు. ఈ ఘటనలో చంద్రబాబు పక్కనే ఉన్న ఆయన ప్రధాన భద్రతాధికారి మధుబాబుకి గాయమైంది. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా నందిగామలోని సీఎం రోడ్ నుండి చంద్రబాబు కాన్వాయ్ వెళుతుండగా చందర్లపాడు బస్టాండ్ సమీపంలో ఈ దారుణం చోటుచేసుకుంది. మధుబాబు గడ్డం కింద గాయమై రక్తస్రావం కావడంతో వెంటనే వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. రాయి విసిరిన ఘటనతో ఎన్ఎస్‌జీ కమాండోలు అప్రమత్తమయ్యారు. 12మంది బృందంతో భద్రత కట్టుదిట్టం చేశారు. రోడ్‌షో త్వరగా ముగించాలని పోలీసులు ఒత్తిడి చేశారు. చంద్రబాబు వాహనం ముందు, వెనుక పెద్ద ఎత్తున రోప్ పార్టీలు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా చంద్రబాబు వాహనం చుట్టూ అదనపు భద్రతాదళాలు మోహరించాయి. ఈ దాడిపై చంద్రబాబు మండిపడ్డారు. ఇలాంటి దాడులకు తాను భయపడబోనని, జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. ఇలాంటి అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పులివెందుల రాజకీయాలు ఇక్కడ చెల్లవని చెప్పారు.

కానరాని కొలువులు

- పెరుగుతున్న నిరుద్యోగం
- అక్టోబర్‌లో 7.77 శాతంగా నమోదు

2లో

ఇదీ లోకం!

ఇప్పటం... ఉద్రిక్తం

- పేదల ఇళ్లు కూల్చివేత
- అధికారులపై స్థానికుల ఆగ్రహం

విశాలాంధ్ర–తాడేపల్లి: జనసేన పార్టీ ఆవిర్భావ సభకు గతంలో ఇప్పటం ప్రజలు స్థలం ఇచ్చారు. అక్కడ పవన్ కల్యాణ్ సభ జరిగింది. ఈ సభలోనే గ్రామానికి ఆయన రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. సభ జరిగిన కొన్ని రోజుల తరువాత ఆ మొత్తం తమకు జమ చేయాలంటూ సీఆర్డీయే అధికారులు వింత డిమాండ్ మొదలుపెట్టారు. దీనికి ఇటు జనసేన కానీ, అటు గ్రామస్థులు కానీ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రస్తుతం ఉన్న 70 అడుగుల రోడ్డును 120 అడుగులకు విస్తరిస్తామంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. 120 అడుగుల రోడ్డు నిర్మిస్తామంటూ దారిలో ఉన్న ఇళ్లను ప్రభుత్వం కూల్చివేసింది. సమయం కూడా ఇవ్వకుండా కొత్తగా కట్టిన ఇళ్లను కూడా నిర్మొహమాటంగా బుల్డోజర్లతో కూల్చివేయించింది. సాధారణంగా గ్రామాల్లో 120 అడుగుల రోడ్లు ఉండవు. గ్రామంలో అంతర్గత రహదారులు 120 అడుగులు చేస్తామని చెప్పి, ఇళ్లను పడగొడుతున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, ఇతర నాయకులు మాట్లాడుతూ కచ్చితంగా ఇది రాజకీయ కక్షేనన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన చేస్తోందని దుయ్యబట్టారు. తాజాగా శుక్రవారం కూడా గ్రామంలో కూల్చివేతలు జరిగాయి. దీన్ని గ్రామస్థులంతా తీవ్రంగా ప్రతిఘటించారు. తమకు అవసరం లేని

- మిగతా 2 లో

ఐరాసలో క్యూబాకు అపూర్వ మద్దతు

ఐరాస : (ప్రెన్సాలాటినా) : అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో గురువారం క్యూబాకు నూతన విజయం చేకూరింది. ఐక్యరాజ్య సమితిలో క్యూబాకు అనుకూలంగా తీర్మానం 180 ఓట్లతో ఆమోదించటంతో క్యూబా అత్యధిక మద్దతు సాధించింది. తీర్మానాన్ని అమెరికా, దాని మిత్రదేశమైన ఇజ్రాయిల్ మాత్రమే వ్యతిరేకించాయి. కాగా, బ్రెజిల్, ఉక్రెయిన్‌లు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఐరాస సాధారణ అసెంబ్లీ ప్లీనరీలో పెద్ద బోర్డులపై ఓట్లను ప్రదర్శించటం అమెరికా ఒంటరి అయిన విషయాన్ని మరోసారి ప్రతిబింబించింది. సాధారణ అసెంబ్లీలో 30వ సారి క్యూబా డిమాండ్లను అమెరికా పెడచెవిన పెట్టిన విషయం బహిర్గతమైంది. అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా క్యూబా తన తీర్మానాన్ని సమర్పించటం 1992లో ప్రారంభించింది. కొవిడ్-19 మహమ్మారి కారణంగా 2020లో మాత్రమే అంతరాయం కలిగింది. ఓటింగ్‌కు ముందుగా జరిగిన చర్చలో క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగజ్ మాట్లాడుతూ, క్యూబా జనాభాలో 80శాతం మందికి పైగా దిగ్బంధనంలో జన్మించినవారేనని చెప్పారు.

సార్వజనీన మద్దతు లభించిన క్యూబా డిమాండ్ల తీర్మానం ఐరాస సాధారణ అసెంబ్లీలో మొదటిసారి ఓటింగ్ జరిగి మూడు దశాబ్దాలు గడిచిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దిగ్బంధనం లేకుండా క్యూబాను శాంతిగా జీవించనివ్వండి అని విదేశాంగ మంత్రి కోరారు. మరింత క్రూరంగా, అమానవీయ పరిమాణంలో క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా ప్రభుత్వం తన శత్రుత్వ విధానాన్ని 2019 నుండి మరింత కట్టుదిట్టం చేసినట్లు రోడ్రిగజ్ వెల్లడించారు. బైడెన్ ప్రభుత్వ మొదటి 14 మాసాల సమయంలో నష్టాలు 630కోట్ల డాలర్లకు పెరిగినట్లు, ఇది సగటున రోజుకు కోటీ 50లక్షల డాలర్లని ఆయన పేర్కొన్నారు.

పాక్‌ను వెంటాడుతున్న రాజకీయ హత్యలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఏడు దశాబ్దాలకు పైగా కాల్పులు, తీవ్రవాదుల దాడులు అనేకమంది రాజకీయవేత్తల ప్రాణాలను బలిగొన్నాయి. హత్యాప్రయత్నాలను ఎదుర్కొన్న నాయకుల సుదీర్ఘ జాబితాలో తాజాగా మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ చేరారు. 1951లో రావల్పిండి కంపెనీ గార్డెన్స్‌లో జరిగిన బహిరంగసభలో పాక్ తొలిప్రధాని మంత్రి లియాఖత్ అలీఖాన్‌ను కాల్చి చంపారు. దాంతో నూతనంగా ఏర్పడిన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులు బీటలువారాయి. లియాఖత్‌పై బుల్లెట్ల వర్షం కురిసిన కంపెనీ గార్డెన్స్‌కు ఆతరువాత లియాఖత్ బాగ్‌గా నామకరణం చేశారు. తాజాగా పాకిస్థాన్ తెహ్రీక్-ఎ- ఇన్సాఫ్ (పీటిఐ) చైర్మన్ ఇమ్రాన్‌ఖాన్‌పై గురువారం హత్యాప్రయత్నం జరిగింది. అటువంటి దాడులు తరచూ విరామ సమయాలతో ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగాయి. మాజీ ప్రధానమంత్రి బెనజీర్ భుట్టో, ఆమె సోదరుడు మీర్‌ముర్తజా భుట్టో, గుజరాత్ చౌధరి జహూర్ ఇలాహిలతో సహా పలువురు రాజకీయవేత్తల ప్రాణాలను ఈ దాడులు తీశాయి. శాసనసభ్యుడు ఖైబార్-ఫక్తూన్‌ఖ్వా (కేపీకే), అవామీ నేషనల్ పార్టీకి చెందిన బషీర్ అహ్మద్ బైలర్, ఆయన కుమారుడు హారూన్ బైలర్, మతపరమైన మేధావి, మాజీ సెనేటర్ మౌలానా సమివుల్ హక్, ముత్తషిద్ క్వామీ మూవ్‌మెంట్‌కు చెందిన సయ్యద్ అలీ రజా అబీది, పీటిఐ సర్దార్ సోరన్‌సింగ్ సహా పలువురు ఇటువంటి దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇమ్రాన్ ఖాన్ లాగానే, పాకిస్థాన్ ముస్లింలీగ్ (నవాజ్)కి చెందిన అధికారంలో ఉన్న ప్రణాళిక మంత్రి అహసాన్ ఇక్బాల్ కూడా హత్యాప్రయత్నంలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. రావల్పిండిలో ఎన్నికల బహిరంగ సభ పూర్తయిన వెంటనే 2007, డిసెంబర్ 27న ఆత్మహత్య బాంబర్ చేతిలో బెనజీర్ హత్యకు గురయ్యారు. బెనజీర్ పదవిలో ఉండగానే 1996 సెప్టెంబర్ 20న కరాచీలో తన ఇంటి సమీపంలో ఆమె సోదరుడు పోలీసు ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. 2011, మార్చి 2న దైవదూషణ చట్టం గురించి, మైనార్టీల హక్కుల గురించి ఉద్యమించిన భట్టిని తుపాకీతో ఒక వ్యక్తి కాల్చి చంపారు. "పాకిస్థాన్‌లో రాజకీయ హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. మంటలు ఇంకా ఆరలేదు, గాయాలు ఇప్పటికీ మానలేదు" అని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తకథనం ప్రచురించింది.

ఖాన్ మాజీ భార్యల ఖండన

ఇమ్రాన్‌ఖాన్‌పై హత్యాయత్నాన్ని ఆయన మాజీ భార్యలు ఖండించారు. రాజకీయవేత్తగా మారిన 70 ఏళ్ల క్రికెటర్ మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. గత రెండు వివాహాలు విడాకులతో ముగిశాయి. ఆయన మొదటి వివాహం బ్రిటిష్ కోటీశ్వరుడు కుమార్తె జెమిమా గోల్డ్ స్మిత్‌తో 1995లో జరిగింది. తొమిదేళ్ల అనంతరం వారు విడిపోయారు. ఆయన రెండవ వివాహం 2015లో టీవీ యాంకర్ రెహమ్‌ఖాన్‌తో జరిగింది. 10 నెలలో అది ముగిసింది. 2018లో ఇమ్రాన్‌ఖాన్ తన "ఆధ్యాత్మిక మార్గదర్శి" బూస్రా మనేకాను మూడవ వివాహం చేసుకున్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

జర్మనీ ఛాన్సలర్ చైనా పర్యటన

బీజింగ్ : ఒక రోజు పర్యటనలో భాగంగా జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్‌స్కోల్జ్ శుక్రవారం బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలుసుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంలో చైనా రహస్యమద్దతు, ఆర్థిక సంబంధాలపై వివాదాలు, మానవహక్కుల సమస్యల నేపథ్యంలో స్కోల్జ్ చైనా పర్యటన విమర్శలను ఎదుర్కొంది.

పలువురు అగ్రశ్రేణి జర్మనీ వాణిజ్యనేతలతో కలిసి చైనా పర్యటనకు వచ్చిన స్కోల్జ్‌కు జిన్‌పింగ్ నుండి లాంఛన పూర్వక స్వాగతం లభించింది. బీజింగ్ నడిబొడ్డున గల గ్రేట్ హాల్ ఆఫ్‌ది పీపుల్‌లో పాలక కమ్యూనిస్టు పార్టీ అధినేతగా ఇటీవల జిన్‌పింగ్ తిరిగి నియమితులయ్యారు. నేడు సంబంధాలలో కీలకభాగంగా వున్న ఆర్థిక మార్పిడుల పున:ప్రారంభం నేపథ్యంలో స్కోల్స్ పర్యటన జరిగిందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. "ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితి జటిలంగా, మార్పు చేయదగినదిగా వుంది" అని జిన్‌పింగ్ అన్నట్లు, నిర్దిష్టంగా ఉక్రెయిన్‌ను ప్రస్తావించకుండా ప్రభుత్వ ప్రసారసాధనం సీసీటీవీ ఉటంకిచింది. మార్పు, గందరగోళ సమయాల్లో ప్రపంచశాంతి, అభివృద్ధికి మరింత దోహదపడే విధంగా ప్రభావవంతమైన శక్తులుగా చైనా-జర్మనీలు ఐక్యం కావాలని స్కోల్జ్ అన్నారు." తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న సమయంలో మనం ఐక్యమయ్యాము." అని స్కోల్జ్ పేర్కొన్నట్లు జర్మనీ వార్తా సంస్థ డీపీఏ తెలిపింది.

చట్టసభ సభ్యుల అనర్హత
ఈసీ అధికారంపై సుప్రీం పరిశీలన

న్యూఢిల్లీ: చట్టసభ సభ్యుని అనర్హత కాలాన్ని ఎత్తివేయడానికి లేదా తగ్గించడానికి ఎన్నికల సంఘానికి అధికారాన్ని కట్టబెట్టే ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధన రాజ్యాంగ చెల్లుబాటును పరిశీలించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. లోక్ ప్రహారీ అనే స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఎన్ శుక్లా దాఖలు చేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి ఉదయ్ ఉమేష్ లలిత్, జస్టిస్ బేల ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం ఈ మేరకు కేంద్రానికి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని ఆక్షేపించబడిన నిబంధన... తొలగింపు లేదా అనర్హత కాలాన్ని తగ్గించడంపై ఎన్నికల సంఘం అధికారంతో ముడిపడి వ్యవహరిస్తుంది. ఈ అధ్యాయం-1 (సెక్షన్ 8ఎ మినహా) కింద ఏదైనా అనర్హతను తొలగించేందుకు లేదా అటువంటి అనర్హతల కాలాన్ని తగ్గించేందుకు గల కారణాలను ఎన్నికల సంఘం నమోదు చేయాలని ఈ నిబంధన చెబుతోంది. విచారణ ప్రారంభంలో... ఎన్నికల సంఘం మితిమీరిన ప్రాతినిధ్యం గల అధికారాన్ని దుర్వినియోగం చేయడం వల్ల ఈ నిబంధనను తొలగించడం లేదా అధ్యయం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిటిషన్‌పై నోటీసు జారీ చేయడానికి ముందు ధర్మాసనం తన అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ... 'సెక్షన్ 11 గురించి పెద్ద విషయం ఏమిటి? భారత ఎన్నికల సంఘానికి అధికారాన్ని అప్పగించవచ్చని పార్లమెంటు స్వయంగా భావించింది' అని పేర్కొంది. పిల్‌పై డిసెంబర్ 5న విచారణ చేయనున్నట్లు తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం... ఏదైనా నేరానికి పాల్పడి, రెండేళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష విధించబడిన వ్యక్తి... అటువంటి నేరారోపణ రుజువైన తేదీ నుంచి అనర్హులుగా ప్రకటించబడతారు. తదుపరి విడుదలైనప్పటి నుంచి మరో ఆరేళ్ల పాటు అనర్హుడిగా కొనసాగుతారు.

కొఠియా గ్రామాలను పట్టించుకోరా?

సరిహద్దు ప్రజలు ఏపీ వైపు మొగ్గు చూపే ప్రమాదం

న్యూఢిల్లీ: ఒడిశా దక్షిణ ప్రాంతంలోని కొఠియా గ్రామాలను పొరుగున గల ఆంధ్రప్రదేశ్ స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ అనుమానం వ్యక్తంచేశారు. ఇప్పటికే సరిహద్దు కొఠియా గ్రామాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, మన ఒడిశా ప్రజలు సైతం ఆంధ్రప్రదేశ్ వైపు మొగ్గు చూపడానికి అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌తో సరిహద్దు గ్రామాల వివాదం సత్వర పరిష్కారానికిగాను అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రధాన్ విజ్ఞప్తి చేశారు. 28 గ్రామాలతో కూడిన కొఠియా క్లస్టర్ ఇప్పటికీ ఒడిశాలోనే ఉన్నప్పటికీ...ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన పార్వతీపురం-మన్యం జిల్లాలో 21 గ్రామాలు కలిసి ఉన్నాయి. ఒడిశాలోని కొన్ని కొఠియా గ్రామాలు పార్వతీపురం-మన్యం జిల్లా కేంద్రానికి కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. కొఠియా పంచాయతీలోని 28 గ్రామాలకుగాను 21 గ్రామాల యాజమాన్యంపై ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ఐదు దశాబ్దాలుగా రాజకీయ పోరాటం సాగిస్తున్నాయి. ఈ వివాదం 1968 నుంచి సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లింది. అఖిలపక్ష సమావేశానికి సంబంధించి నవీన్ పట్నాయక్‌కు ధర్మేంద్ర ప్రధాన్ అక్టోబరు 31న లేఖ రాశారు. ఆ లేఖను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒడిశాకు చెందిన నాయకుడు. సరిహద్దు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించాలని ముఖ్యమంత్రికి ప్రధాన్ విన్నవించారు. 2020, 2021లోనూ తాను రాసిన లేఖల విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 28 సరిహద్దు గ్రామాలలో ఉన్న సమస్యలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. కొఠియా గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిసి ఉన్నట్లు కొంతకాలంగా సమాచారం అందుతోందని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ సమస్యకు తక్షణమే స్వస్తి చెప్పకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొఠియా గ్రామాలకే పరిమితం కాకుండా దక్షిణ ఒడిశాలోని ఇతర గ్రామాలకు సైతం విస్తరిస్తుందని కేంద్ర మంత్రి ప్రధాన్ హెచ్చరించారు. ఆ గ్రామాలను తమలో కలుపుకోవడానికిగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కొఠియాలో కొనసాగిస్తోందని గుర్తుచేశారు. ఒడిశా ప్రభుత్వం సైతం క్రియాశీలకగా పనిచేయాలని, నిర్లక్ష్యం ఏమాత్రం మంచిది కాదని నవీన్ పట్నాయక్‌కు సూచించారు. సరిహద్దు గ్రామాల ప్రజల వద్దకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సరిహద్దు గ్రామ ప్రజలకు జిల్లా కేంద్రం చాలా దూరంగా ఉండటంతో వారంతా ఆంధ్రప్రదేశ్ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ పాలనాయంత్రాంగం సరిహద్దు ప్రజలకు మరింత దగ్గరగా ఉందని తెలిపారు. ఒడిశా ప్రభుత్వం ఇలాగే సాచివేత ధోరణి ప్రదర్శిస్తే కొఠియా గ్రామాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో కలవడం ఖాయమని, కొఠియా పౌరుల సామాజిక, సాంస్కృతిక జీవన విధానాలు మారిపోతాయని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. మొత్తంగా తమ మాతృభూమిని మర్చిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

రేషన్‌కార్డులు, ఆరోగ్య సేవలు, విద్య, ఇతర సదుపాయాలు ఆశ చూపడం ద్వారా సరిహద్దు గ్రామాల ప్రజల మన్ననలు పొంది తమ వైపే ఉంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజలు, సంస్థలను విశ్వాసంలోకి తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సేవలను సరిహద్దు ప్రజలు మర్చిపోయేలా మన ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను ప్రభుత్వం వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దు వివాదాలు కొనసాగుతుంటే ఆ ప్రాంత ప్రజల మధ్య సామరస్యత దెబ్బతినడమే కాకుండా కొఠియా గ్రామాల్లో అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కానరాని కొలువులు

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత నెల 22వ తేదీన భోపాల్‌లో అట్టహాసంగా "రోజ్‌గార్ మేళా" (ఉద్యోగాల పంపిణీ సంత)ను ప్రారంభించారు. ఆ సందర్భంగా తమ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల కల్పనకు చేసిన కృషిని ఏకరవు పెట్టేందుకు ఆయన భజనపరులు పోటీపడ్డారు. అయితే, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగావుంది. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్ప నుంచి దేశంలో నిరుద్యోగం పెరుగుతూనే ఉన్నది. అక్టోబరులో గరిష్ఠానికి చేరింది. 2018లో 6.2 శాతంతో కొద్దిగా తగ్గిన నిరుద్యోగ సమస్య ఆ తరువాత మళ్లీ పెరుగుతూనే ఉంది. మోదీ అనుసరిస్తున్న అస్తవ్యవస్థ విధానాలు దేశ యువతకు శాపంగా మారుతున్నాయనీ, దాని ఫలితంగానే దేశంలో నిరుద్యోగం తాండవిస్తున్నదని నిపుణులు తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని మరిచారన్నారు. దేశ యువత దీనిపై కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.

ఈ ఏడాది అక్టోబరులో నిరుద్యోగ శాతం 7.77 శాతానికి చేరిందని సెంటర్ ఫర్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) నివేదిక తెలిపింది. దేశంలో నిరుద్యోగం ఒక్కో నెలకు ఒక్కో శాతం పెరుగుతూ వస్తున్నదని ఆ నివేదిక వెల్లడించింది. సెప్టెంబర్‌లో 6.43 శాతంగా ఉన్న నిరుద్యోగం అక్టోబర్ నాటికి 7.77 శాతానికి పెరిగింది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికం

ఒక్క నెలలోనే ఏకంగా 1.34 శాతం పెరిగింది. గ్రామాల్లో నిరుద్యోగం రేటు అత్యధికంగా పెరిగింది. అక్కడ సెప్టెంబర్‌లో 5.84 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు, అక్టోబర్ నాటికి 8.04 శాతానికి చేరింది. కార్మిక భాగస్వామ్యం రేటు సెప్టెంబర్‌లో 39.3 శాతంగా ఉండగా, అక్టోబర్‌కు 39 శాతానికి తగ్గింది. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే నిరుద్యోగం రేటు ఎక్కువగా ఉన్నది. హర్యానా 31.8 శాతంతో అత్యధిక నిరుద్యోగ రేటును నమోదు చేసింది. ఆ తర్వాత స్థానాల్లో రాజస్థాన్ (30.7 శాతం), జమ్ము-కశ్మీర్ (22.4 శాతం), జార్ఖండ్ (16.5శాతం), బీహార్ (14.5 శాతం), త్రిపుర (10.5 శాతం) ఉన్నాయి.

దాడి గర్హనీయం: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తోందని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై దాడికి పాల్పడటం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. చంద్రబాబుపై దాడిని శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాల అణచివేతే లక్ష్యంగా జగన్ పాలన సాగుతోందనీ, ప్రజాఉద్యమాలు, శాంతియుత నిరసనలపై పోలీసులను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. సీఐడీ పోలీసులు అర్ధరాత్రి దాడి చేసి మాజీమంత్రి అయ్యన్నపాత్రుడిని అక్రమంగా అరెస్టు చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో చంద్రబాబుపై దాడి జరుగుతుంటే పోలీసులు కళ్లప్పగించి చూశారు. ఈ దాడి పోలీసుల వైఫల్యానికి అద్దం పడుతోందని రామకృష్ణ మండిపడ్డారు.

రాజకీయాల్లో ఇలాంటి దాడులు సరికాదని, ప్రశ్నించే గొంతుల్ని అణచివేసేందుకు వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

వేర్పాటువాద నేత షబీర్ ఇల్లు ఎటాచ్: ఈడీ

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్ వేర్పాటువాద నాయకుడు షబీర్ అహ్మద్‌షాకు చెందిన శ్రీనగర్‌లోని ఇంటిని అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం తెలిపింది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆజ్యం పోసిన కేసులో మనీలాండరింగ్ విచారణలో భాగంగా ఈ చర్య చేపట్టినట్లు వెల్లడించింది. శ్రీనగర్ బార్జుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని సనత్ నగర్ బోత్రా కాలనీలో షబీర్‌కు రూ.21.80 లక్షల విలువైన ఇల్లు ఉందని అధికారులు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)లోని వివిధ సెక్షన్ల కింద లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్, ఇతరులపై 2017 మేలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా షబీర్‌పై మనీలాండరింగ్ కేసు నమోదైంది. షాబీర్ అహ్మద్ షా రాళ్లు రువ్వడం, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు, హర్తాళ్లు, ఇతర విధ్వంసక చర్యల ద్వారా కశ్మీర్ లోయలో అశాంతికి ఆజ్యం పోసే కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నట్లు ఈడీ పేర్కొంది. 2017లో అరెస్టయిన షబీర్ అహ్మద్‌ను ప్రస్తుతం దిల్లీ జైలులో ఉంచారు.

అత్యవసర విచారణా?

(మొదటిపేజీ తరువాయి)

అధ్యయనం చేయడానికి తమకు కొంత సమయం కావాలని న్యాయమూర్తి చెప్పారు. అయితే రైతుల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ఫాలీ నారిమన్ బ్రీఫ్ నోట్ ఇస్తామని సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే ఈనెల 7వ తేదీకి విచారణ వాయిదా వేస్తామని తెలియజేయగా, తమకు వారం రోజుల సమయం ఇవ్వాలని కోరుతూ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కోర్టు సౌకర్యార్థం అఫిడవిట్‌ను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు నారీమన్ తెలిపారు. దానికి ప్రభుత్వ న్యాయవాది అభ్యంతరం తెలుపుతూ సమయం పొడిగించకుండా 7వ తేదీనే విచారణకు తీసుకోవాలని విన్నవించారు. రెండుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం...విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో శుక్రవారం 17 ఏళ్ల బాలికకు వివాహం చేసేందుకు ఒక కుటుంబం చేసిన ప్రయత్నాన్ని అధికారులు విఫలం చేశారు. దబ్లి గ్రామంలో మైనర్ బాలికకు 21 ఏళ్ల యువకుడితో వివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్న సంబంధిత అధికారులు...బాల్య వివాహాల వల్ల జరిగే పరిణామాలపై బాలిక కుటుంబ సభ్యులను హెచ్చరించి వేడుకను అడ్డుకున్నారు. బాలికకు 18 ఏళ్లు నిండటానికి మరో నాలుగు నెలల సమయం ఉందని, ఇది వివాహానికి చట్టబద్ధమైన వయసని బాల్య వివాహాల నిరోధక బృందం ఇన్‌చార్జ్ మహేంద్ర పాఠక్ తెలిపారు. బాల్య వివాహాల చేసినట్లయితే చట్ట ప్రకారం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష లేదా రూ.2 లక్షల జరిమానా లేదా రెండింటినీ విధించే అవకాశం ఉంది.

ఇప్పటం... ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

120 అడుగుల రోడ్డు కోసం ఇళ్ల స్థలాలు పోగొట్టుకోలేమని వారు అడ్డుకున్నారు. అయితే పోలీసుల సాయంతో అధికారులు కూల్చివేతలు కొనసాగించారు. ఈక్రమంలో మంగళగిరి జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర విచారణ జరిపి కూల్చివేతలను నిలిపివేసేలా కోర్టు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై అత్యవసర విచారణ జరిపిన న్యాయస్థానం, తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకూ కూల్చివేతలు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కూల్చివేతల కారణంగా ఉదయం నుంచి ఇప్పటంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

ప్రభుత్వ విధ్వంసానికి మరో మచ్చుతునక: ముప్పాళ్ల

తాడేపల్లి మండలం ఇప్పటంలో రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్లను కూల్చి వేసిన ప్రాంతాన్ని శుక్రవారం సాయంత్రం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ నాయకులు పరిశీలించారు. రాజకీయ కక్షతో అత్యంత ఖరీదైన పక్కా భవనాలను పగులగొట్టడం ప్రభుత్వ విధ్వంసానికి ఇది మరో మచ్చుతునకని ముప్పాళ్ల అన్నారు. జనసేన, టీడీపీ, కమ్యూనిస్టు అభిమానులు కలిగిన ఈ గ్రామం చైతన్యానికి మారుపేరని తెలిపారు. భాగ్యనగరంలోని జూబ్లీహిల్స్ లాంటి విశాలమైన రోడ్లు ఇప్పటంలో ఉన్నాయని ఆయన చెప్పారు. మార్చిలో జనసేన సభ జరుపుకోవడానికి గ్రామస్తులు సహకరించారని, ఎవరైతే ఆ సభకు సహకరించారో వారిపై కక్ష సాధింపు చర్యగా విధ్వంసం చేసి కూల్చివేశారని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పైశాచికత్వానికి నిదర్శనమే ఈ కూల్చివేతలని అన్నారు. ఇప్పటంలో ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, మంగళగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్, జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, బేతపూడి విజయ్ శేఖర్, చవ్వాకుల కోటేష్ బాబు, సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు జంగాల సాంబశివరావు, అమరా సుబ్బారావు, కళ్ళం రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

స్ఫూర్తి దాయకం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ జాతీయ మహాసభలు విజయవంతం అయినందుకు అజీజ్‌పాషాకు జ్ఞాపికను అందజేస్తున్న రామకృష్ణ పక్కన చాడ, కూనంనేని, ముప్పాళ్ల, వనజ, పీజే, శంకర్, జేవీఎస్ఎన్, కోటేశ్వరరావు

వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణకు చెందిన మరో ఆహ్వాన సంఘం ప్రధానకార్యదర్శి చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలు చరిత్రాత్మకమైనవిగా అభివర్ణించారు. మహాసభల స్ఫూర్తితో మొదటి నుండి కమ్యూనిస్టు గడ్డగా పేరొందిన విజయవాడ నగరపాలకసంస్థపై సీపీఐ జెండా ఎగురవేయాలని ఆకాంక్షించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో విజయవాడ నగరానికి ప్రత్యేక చరిత్ర ఉందని, తనకు ఈ నగరంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మహాసభల విజయవంతానికి తెలంగాణ నుంచి జన, ధన సమీకరణలో తమ వంతు సహకారం అందించామని తెలిపారు. ఏర్పాట్లలో ఏ లోటూ లేకుండా ఆయా కమిటీలు టీమ్ స్పిరిట్‌తో సమర్థవంతంగా నిర్వహించి, మహాసభలను జయప్రదం చేశాయని అభినందించారు. ఆహ్వాన సంఘం కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మహాసభల నిర్వహణకు ప్రజలందించిన విరాళాలు, ఖర్చుల వివరాలను సభకు సమర్పించారు. మహాసభల విజయవంతానికి కృషి చేసిన కమిటీ సభ్యులందరికీ జ్ఞాపికలు అందజేసి ప్రత్యేకంగా సత్కరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, ఆహ్వానసంఘం ప్యాట్రన్స్, మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు, ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, జి.ఓబులేసు, పి.హరినాథరెడ్డి, కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, అక్కినేని వనజ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.దుర్గాభవాని, జంగాల అజయ్‌కుమార్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్ ఆహ్వానసంఘ సభ్యులను వేదికపైకి ఆహ్వానించారు.

మోదీ, షా, నడ్డాలపై కేసు పెట్టాలి: కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణలో నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన వ్యవహారంలో సీఎం కేసీఆర్ బయట పెట్టిన వీడియోల ఆధారంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఎల్ సంతోష్‌లపై కేసులు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఎనిమిది రాష్ట్రాల్లో ప్రజాస్వామిక ప్రభుత్వాలను కూల్చివేయడంలో తమ పాత్ర ఉన్నదని, అలాగే ప్రధాని, కేంద్ర హోంమంత్రిల పాత్ర ఉన్నదని వీడియోలో మఠాధిపతులు పదే పదే చెప్పడాన్ని ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోల ఆధారంగా ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టడానికి జరిగిన కుట్రపై రాష్ట్రాల హైకోర్టులు సూమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు.

వలసలతో ఊళ్లు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

వెళ్తున్నారు. తెలంగాణలో పత్తి పనులకు ఎక్కువగా వెళుతున్నారు. అక్కడ కిలో పత్తి తీస్తే 12 నుంచి 13 రూపాయలు ఇస్తారు. ఒక్క కోసిగిలోనే 500 కుటుంబాలు వలస వెళ్లాయి. అదేవిధంగా ప్రతి గ్రామంలో 50 కుటుంబాలు లెక్క వేసుకున్నా మండలంలో దాదాపు 1000 కుటుంబాలు పైనే వలసబాట పట్టాయి. స్థానికంగా ఉపాధి పనులు లేకపోవడం మరో సమస్యగా ఉంది. పక్కనే ఉన్న కర్ణాటకలోని రాయచూరు జిల్లాకు సైతం ప్రతిరోజు రెండు వేల మంది వలస పోతున్నారు. అక్కడ గౌండా పని, డ్రైనేజీ పనులు, పొలం పనులతో పొట్ట నింపుకుంటున్నారు.

స్థానికంగా పనులు లేకపోవడం, చిన్న,పెద్ద కలిసి ఒకేచోట పనులు చేస్తే పెద్ద మొత్తం డబ్బులు ఒకేసారి రావడంతో ప్రజలు సైతం వలసలకు ఆసక్తి చూపుతున్నారు. వలస ప్రాంతంలో కూలి ఎక్కువగా రావడం కూడా వలసలకు కారణమవుతోంది. ఇక్కడ ఇంట్లో పది మంది ఉంటే ముగ్గురు, నలుగురు మాత్రమే కూలికి వెళతారు. అదే వేరే పట్టణాలకు వలస వెళ్తే కుటుంబంలో ఉన్న పదిమంది పనిలోకి వెళ్లాల్సిందే. దీంతో కూలి డబ్బులు ఎక్కువగా వస్తాయి. దీనివల్ల చేసిన అప్పులు తీర్చడం తేలికవుతుంది. వలసల వల్ల నష్టాలు సైతం ఉన్నాయి. చిన్న పిల్లలు చదువుకు దూరమవుతారు. అక్కడున్న పరిస్థితులను బట్టి అనారోగ్యాలకు గురికావడం వంటివి జరుగుతాయి. వెళ్లిన చోట సరైన సౌకర్యాలు లేక రోడ్ల పక్కన, పొలం గట్లపైన, పెద్దపెద్ద భవనాల పక్కన చెత్తాచెదారం వేసే చోట గుడారాలలో జీవించాల్సిన దుస్థితి ఉంది.

వలసలు నివారించాలంటే స్థానికంగా ఉపాధి పనులు పుష్కలంగా ఉండాలి. ఉపాధి పనులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. పనికి గిట్టుబాటు కూలి రావడం లేదు...చేసినా ప్రభుత్వం సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదు. పత్రికలలో వార్తలు రావడం లేదా వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతుసంఘాలు ఆందోళన చేస్తే తప్ప ప్రభుత్వానికి సమస్య తెలియడం లేదు. తెలిసినా వలసల నివారణకు చర్యలు శూన్యం. ఈ సమస్యలను గుర్తించి అనువైన పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వలసలను నియంత్రించవచ్చు. ఆర్డీఎస్, వేదవతి వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసినా కొంత మేరకు వలసల నివారణకు మార్గం సుగమమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు వారి కార్యాలయము, ఒంగోలు

లేఖ నెం.ఆర్.సి.బి/180/ 2021 ది. 15-09-2022

ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కలసపాడు బ్రాంచి కాలువ కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.866 మరియు కి.మీ. 3.755 నుండి కి.మీ. 4.315 నిర్మాణము కొరకు భూమి కావలయునని శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు భావించినందున, 2013 సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెల్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

శ్రీయుత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, యల్.ఎ.ఆర్ & ఆర్ యూనిట్, కంభంవారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమునకై అనగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.866 మరియు కి.మీ. 0.866 నుండి కి.మీ. 3.755 నిర్మాణము కొరకు భూమి అవసరమైనదని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం మండలం : గిద్దలూరు గ్రామము : నెం: 66 - గిద్దలూరు

క్రమ సంఖ్య	సర్వే నెం./ స.డి. నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూ స్థితి	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	సంబంధిత ఆసామీ పేరు (పట్టాదారు) మరియు చిరునామా	సంబంధిత ఆసామీ పేరు (అనుభవదారు) మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1	525	7.92	సర్కారు పుంజ	0.23	తరుగు మల్లమ్మ భర్త బాల కాశయ్య	తరుగు మల్లమ్మ భర్త బాల కాశయ్య	533	524	534	526	
2	527	5.96	ఇనాం పుంజ	0.135 0.135 0.13 0.78 0.78	దప్పిలి చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి విజయభాస్కరరెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి జయమ్మ భర్త రంగస్వామి దప్పిలి వెంకట దుర్గ శ్రీకాంత్ తండ్రి కాశిరెడ్డి దప్పిలి గౌతంరెడ్డి తండ్రి కాశిరెడ్డి	దప్పిలి చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి విజయభాస్కరరెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి జయమ్మ భర్త రంగస్వామి దప్పిలి వెంకట దుర్గ శ్రీకాంత్ తండ్రి కాశిరెడ్డి దప్పిలి గౌతంరెడ్డి తండ్రి కాశిరెడ్డి	525 526	531	533	528	
3	529/1	1.93	ఇనాం పుంజ	0.30	యాదగిరి రంగస్వామి తండ్రి పుల్లయ్య	యాదగిరి రంగస్వామి తండ్రి పుల్లయ్య	530	కొంగల వీడు	560	528	
4	529/2	1.93	ఇనాం పుంజ	0.32	అంగం వెంకటేశ్వర్లు తండ్రి ఎం.ఎల్.ఎ. కోటయ్య	అంగం వెంకటేశ్వర్లు తండ్రి ఎం.ఎల్.ఎ. కోటయ్య	530	కొంగల వీడు	560	528	
5	529/3	3.36	ఇనాం పుంజ	0.58	కమతం శ్రీనివాసరావు తండ్రి చిన్న నారాయణ	కమతం శ్రీనివాసరావు తండ్రి చిన్న నారాయణ	530	కొంగల వీడు	560	528	
6	530	3.38	సర్కారు	0.42	సత్వేలి రంగయ్య తండ్రి పెద్ద రంగన్న	సత్వేలి రంగయ్య తండ్రి పెద్ద రంగప్ప	531	529	551	528	
7	531/1	1.42	సర్కారు పుంజ	0.34	అంగం వెంకటేశ్వర్లు తండ్రి పెద్ద వెంకటేశ్వర్లు	ప్లాట్స్ 62, 63, 64, 65, 66, 67, 68, 69, 70, 71, 72పార్ట్, 75పార్ట్, 76పార్ట్	532	530	551	528	
8	532/1	1.14	సర్కారు పుంజ	0.13	యాదగిరి రంగస్వామి తండ్రి పుల్లయ్య	యాదగిరి రంగస్వామి తండ్రి పుల్లయ్య	533	531	551	527	
9	533/1	3.90	ఇనాం పుంజ	0.41 0.285 0.285	పల్లె శ్రీనివాసులరెడ్డి తండ్రి పుల్లారెడ్డి పల్లె రమణారెడ్డి తండ్రి తిరుపాల్ రెడ్డి పల్లె తిరుపాల్ రెడ్డి తండ్రి చిన్న వెంకటరెడ్డి	పల్లె శ్రీనివాసులరెడ్డి తండ్రి పుల్లారెడ్డి పల్లె రమణారెడ్డి తండ్రి తిరుపాల్ రెడ్డి పల్లె తిరుపాల్ రెడ్డి తండ్రి చిన్న వెంకటరెడ్డి	525 534 535	532	549 550	527	
10	533/2		ఇనాం పుంజ	0.26	భూమిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి కేశవరెడ్డి	భూమిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి కేశవరెడ్డి	525 534 535	532	549 550	527	
11	533/3		ఇనాం పుంజ	0.16	భూమిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి కేశవరెడ్డి	భూమిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి కేశవరెడ్డి	525 534 535	532	549 550	527	
12	534/3	0.60	సర్కారు పుంజ	0.39	దప్పిలి విజయభాస్కరరెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి విజయకుమారి భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి దప్పిలి జయలక్ష్మమ్మ భర్త చంద్రశేఖర్ రెడ్డి	ప్లాట్స్	521	533	535	525	
13	535/1	1.38	సర్కారు పుంజ	0.01	దప్పిలి విజయభాస్కరరెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి విజయకుమారి భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి దప్పిలి జయలక్ష్మమ్మ భర్త చంద్రశేఖర్ రెడ్డి	ప్లాట్స్	521	533	536	534	
14	535/2	1.08	సర్కారు పుంజ	0.44	దప్పిలి విజయభాస్కరరెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి విజయకుమారి భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి దప్పిలి జయలక్ష్మమ్మ భర్త చంద్రశేఖర్ రెడ్డి	ప్లాట్స్	521	533	548	534	
15	535/3	1.98	సర్కారు పుంజ	0.90	దప్పిలి విజయభాస్కరరెడ్డి తండ్రి పాండురంగారెడ్డి దప్పిలి విజయకుమారి భర్త రాజేంద్రప్రసాద్‌రెడ్డి దప్పిలి జయలక్ష్మమ్మ భర్త చంద్రశేఖర్ రెడ్డి	ప్లాట్స్	521	533	548	534	
16	536/1	1.58	సర్కారు పుంజ	0.50	షేక్ ఖాదర్ హుస్సేన్ భాషా తండ్రి హుస్సేన్ పీరాన్	ప్లాట్స్	537	548	841 847	535	
17	536/2	3.73	సర్కారు పుంజ	1.03	పల్లె గోవిందరెడ్డి తండ్రి వెంకటరెడ్డి పల్లె వెంకటరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	ప్లాట్స్	537	548	841 847	535	ఆర్‌సి సి గోడ
18	536/3	1.61	సర్కారు పుంజ	0.19	పల్లె శ్రీనివాసులరెడ్డి తండ్రి పుల్లారెడ్డి	పల్లె శ్రీనివాసులరెడ్డి తండ్రి పుల్లరెడ్డి	537	548	841 847	535	
19	537/1	0.93	సర్కారు పుంజ	0.005 0.005	పల్లె గోవిందరెడ్డి తండ్రి వెంకటరెడ్డి పల్లె వెంకటరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	పల్లె గోవిందరెడ్డి తండ్రి వెంకటరెడ్డి పల్లె వెంకటరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	539	536	539	521	
20	537/2	2.00	సర్కారు పుంజ	0.33 0.33	పల్లె గోవిందరెడ్డి తండ్రి వెంకటరెడ్డి పల్లె వెంకటరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	పల్లె గోవిందరెడ్డి తండ్రి వెంకటరెడ్డి పల్లె వెంకటరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	539	536	539	521	
21	539/3ఎ	1.70	సర్కారు పుంజ	0.37	దప్పిలి రామిరెడ్డి తండ్రి చిన్న వీరారెడ్డి	ప్లాట్స్	515	537	540	521	
22	539/4సి	1.17	సర్కారు పుంజ	0.04	ప్లాట్స్	ప్లాట్స్	515	537	540	521	
23	548/2	3.56	సర్కారు పుంజ	0.05	జల్లిపల్లి నెమలిగుండం తండ్రి చిన్న రంగప్ప జల్లిపల్లి రంగసాయి గౌతం తండ్రి రంగ నాయకులు జల్లిపల్లి వెంకట రంగ శివ స్వరూ తండ్రి రంగ నాయకులు	జల్లిపల్లి నెమలి గుండం తండ్రి చిన్న రంగప్ప జల్లిపల్లి రంగసాయి గౌతం తండ్రి రంగ నాయకులు జల్లిపల్లి వెంకట రంగ శివ స్వరూ తండ్రి రంగ నాయకులు	515	537	540	521	
మొత్తము				10.27							

ఈ ప్రతిపాదిత భూసేకరణలో ఆర్ & ఆర్ సర్వే, సంబంధిత గ్రామములో ఇంటింటికి వెళ్ళి సర్వే చేయడం జరిగినది. నూతన భూసేకరణ మరియు పునరావాస పునః స్థాపన, న్యాయమైన పారదర్శక నష్టపరిహారము పొందే హక్కు చట్టము-2013 ప్రకారము అర్హులైన నిర్వాసిత కుటుంబములు గాని ప్రభావిత కుటుంబములు కానీ లేవు.

ఈ భూముల ప్లాను శ్రీయుత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్.ఎ, ఆర్ & ఆర్ యూనిట్, కంభం వారి కార్యాలయంలో ఉంచడమైనది దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణవలన నిర్వాసితులయినవారు ఎవ్వరును లేరు.

సం/- ఎస్.సరళ వందనం
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ)
పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, ఒంగోలు

పరిశ్రమలకు పెద్దపీట

- స్థానికులకు ఉపాధి అవకాశాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- రూ.270 కోట్ల ఇథనాల్ పరిశ్రమకు శంకుస్థాపన

విశాలాంధ్ర-గోకవరం: గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి వద్ద సుమారు రూ.270 కోట్లతో అసాగో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తున్న బయో ఇథనాల్ యూనిట్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. 'మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ ప్రాంతానికి మంచి చేసే ప్లాంట్ రాబోతోంది. రూ.270 కోట్లతో టెక్ మహీంద్రా గ్రూప్ ఇథనాల్‌ను ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏపీలో మంచి వాతావరణం ఉంది. కేవలం ఆరు నెలల కాలంలోనే అనుమతులు మంజూరు చేసి, భూమి పూజ కూడా చేశాం. 2లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్లాంట్ రాబోతుంది. ఈప్లాంట్ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బ్రోకెన్ రైస్‌తో ప్లాంట్‌లో ఇథనాల్ తయారీ చేస్తారు. ప్లాంట్‌తో పాటు పశువుల దాణా, చేపల మేతకు ఉపయోగపడే ప్రోటీన్ ఫీడ్ కూడా అందుబాటులోకి వస్తుంది. రంగు మారిన ధాన్యానికి కూడా మంచి ధర లభిస్తుంది' అని సీఎం జగన్ అన్నారు. కాగా, రాజమహేంద్రవరానికి సమీపంలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్‌లో 20 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ యూనిట్ ద్వారా రోజుకు 200 కిలోలీటర్ల బయో ఇథనాల్ ఉత్పత్తి అవుతుంది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 100 మందికి, పరోక్షంగా 400 మందికి ఉపాధి లభించనుంది. ముడిచమురు దిగుమతుల బిల్లును తగ్గించుకోవడంతో పాటు హరిత ఇంధన వినియోగం పెంచడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న లక్ష్యంగా 2025-26 నాటికి ప్రతి లీటరు పెట్రోల్‌లో 20 శాతం బయో ఇథనాల్ మిశ్రమం కలపడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం లీటరు పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం సగటున 8.41 శాతంగా ఉంది. కోటిలీటర్ల ఇథనాల్‌ను వినియోగించడం ద్వారా 20 వేల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతున్నట్లు అనేక పరిశీలనల్లో వెల్లడైంది. ఒక్కసారిగా కేంద్ర ప్రభుత్వం భారీ లక్ష్యాలను నిర్దేశించడంతో అనేక సంస్థలు ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. భూ కేటాయింపుల దగ్గర నుంచి అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని, ఈ పెట్టుబడుల ద్వారా హరిత పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని అస్సాగో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ గుర్నానీ తెలిపారు. భవిష్యత్‌లో ప్రత్యామ్నాయ ఇంధన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి లభించడమే కాకుండా వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రైతులకు అదనపు ప్రయోజనం లభిస్తుందని చెప్పారు. పాడైపోయిన ఆహారధాన్యాలు, నూకలు, వ్యవసాయ ఉత్పత్తుల అవశేషాలు వినియోగించి ఇథనాల్‌ను తయారు చేయడం ద్వారా రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, జగ్గంపేట, రాజానగరం ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, జక్కంపూడి రాజా, అస్సా ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ఆసీస్ గుర్నాని, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కే మాధవీలత, కాకినాడ రాజమండ్రి ఎంపీలు వంగా గీత, మార్గాని భరత్ రామ్, ప్రభుత్వ విప్ చెర్ల జగ్గిరెడ్డి, ఎస్పీలు కుమార్ రెడ్డి, రవీంద్రనాథ్ బాబు, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ చైత్ర వర్షిణి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ గిడ్డంగుల సంస్థకు జాతీయ స్థాయి అవార్డు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు జాతీయ స్థాయి అవార్డు రావడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ కరీముల్లా షేక్ అమీన్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణాధికార సంస్థ 12వ వార్షికోత్సవ దినం పురస్కరించుకుని ఢిల్లీల్లో ఈ ఏడాది అక్టోబర్ 31న అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణా సంస్థ నిబంధనలను అధిక శాతం మేర నిర్వహించి, మెరుగైన ఫలితాలు సాధించిన సంస్థలను అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ ఖాతా దారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించడంలో చిత్తశుద్ధితో పని చేస్తోందని కరీముల్లా పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఒకటని వివరించారు. ఈ అవార్డు అందుకోవడంపై రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కంఠనాథ్‌రెడ్డి, అధికారులు, రైతులు, ఖాతాదారులు తమ అభినందనలను తెలియజేశారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు యువత ప్రతిబింబం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విశాలాంధ్ర-పెనమలూరు: నేటి యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి బింబాలు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. కానూరు కేసీపీ సిద్ధార్థ పాఠశాలలో చిన్నారులతో ముచ్చట్లు కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన మన భారతీయ సంస్కృతి ప్రపంచ మనుగడకు దిక్సూచి లాంటిదన్నారు. ఈ ఘన చరిత్రను మనం మరచిపోయి పాశ్చాత్య పోకడలకు ప్రాధాన్యం ఇస్తూ, అదే ఘనంగా భావిస్తే మన గొయ్యి మనమే తవ్వుకున్నవాళ్లమవుతామన్నారు. ఎందరో మహానుభావులు ఘనమైన పాలనను అందించిన పుణ్యభూమి మన భారతభూమని తెలిపారు. మాటకు ముందు సార్, వెనుక సార్ అంటూ, గుడ్‌మార్నింగ్ అంటూ పూటకో మాటతో మన ఉనికిని పోగొట్టుకోవద్దని నమస్తే అంటూ పలకరింపునకు ప్రపంచం దాసోహమవుతుందని హితవు పలికారు. విద్యార్థుల సందేహాలకు చక్కటి సమాధానాలు అందించారు. సహజ సిద్ధ ఆహారోత్పత్తులు, పనిముట్లు విక్రయించే శ్రీవాణి స్టోరును సందర్శించిన వెంకయ్యనాయుడు ఆయా ఉత్పత్తుల తయారీ, రుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ దొరికే బెల్లం మిఠాయిలు, పల్లె వాతావరణానికి అద్దం పట్టే మట్టి పాత్రలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తదితరాలను పరిశీలించారు. ఆరోగ్య ప్రదాయనిగా నిలచే ఆహారపు అలవాట్లు ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని కోరారు. పుర ప్రముఖులు, అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కర్నూలు డీఈవోపై చర్యలు తీసుకోండి: ఎస్టీయూ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదులో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ఆధారాలు లేకుండా సర్వీస్ ధృవపత్రాలు జారీ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి వి.రంగారెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకుని, విధుల నుంచి తప్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేష్‌కుమార్ మీనాకు ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న శుక్రవారం వెలగపూడి సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎలాంటి రికార్డులు లేకుండానే వేల సంఖ్యలో అక్రమ ఓటరు నమోదుకు కారణమవుతున్న డీఈవోపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీఈవో మీనా మాట్లాడుతూ... ఈ నెల 7వ తేదీ తర్వాత విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఒత్తిళ్లకు గురై సంతకాలు పెడితే అధికారులే బాధ్యత వహించాలని తిమ్మన్న స్పష్టం చేశారు. అనంతపురం, నెల్లూరు డీఈఓల అక్రమ బదిలీలు రద్దు చేయాలని, ఓటరు నమోదులో గ్రామ వలంటీర్లు జోక్యాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు.

'మధ్యాహ్న' కార్మికుల వేతనాలు పెంచుతాం: బొత్స

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికుల వేతనాల పెంపునకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. మంత్రి చాంబరులో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం సంఘం(ఏఐటీయూసీ) నేతలు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భోజన పథకం కార్మికుల వేతనాలు పెంచనందున ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. వాటిపై మంత్రి బొత్స సానుకూలంగా స్పందించి, కార్మికుల వేతనాల పెంపునకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకట సుబ్బయ్య, మధ్యాహ్న భోజన పథకం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.స్రవంతి, కార్యవర్గ సభ్యుడు బుగత అశోక్ పాల్గొన్నారు.

సమరయోధుల రూపచిత్రాల సమాహారం

స్వాతంత్ర్య స్ఫూర్తి - తెలుగు దీప్తి

గవర్నర్ చేతులమీదుగా పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాల సమాహారంగా 'స్వాతంత్ర్య స్ఫూర్తి - తెలుగు దీప్తి' పేరిట పుస్తకం రూపుదిద్దుకోవటం ముదావహమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల నేపథ్యంలో శుక్రవారం రాజ్ భవన్ వేదికగా ఈ సంకలనాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 133 మంది పోరాట యోధుల చిత్రపటాలు, సంక్షిప్త సమాచారంతో ఈ పుస్తకాన్ని తీసుకురావటం అభినందనీయమన్నారు. నేటి బాలలు, యువతలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించేలా ఈ తరహా గ్రంథాలు మరిన్ని రూపుదిద్దుకోవాలన్నారు. ఆర్ట్ అసోసియేషన్స్ గిల్డ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగ్గా, గిల్డ్ అధ్యక్షుడు డాక్టర్ బీఏ రెడ్డిని గవర్నర్ అభినందించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఆర్ పి సిసోడియా, గిల్డ్ ఉపాధ్యక్షుడు సుభాష్ బాబు, కన్వీనర్ రమేష్, ఆర్టిస్ట్ అప్పారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి ఎన్నికలు

ఓటు నమోదుకు 23 నుంచి మరో అవకాశం

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జరగనున్న శాసనమండలి ఎన్నికల కోసం ఓటర్ల నమోదుకు తొలివిడతలో నవం బరు ఏడు చివరి తేదీ కాగా, మలి విడతలో నవంబరు 23 నుండి డిసెంబరు 9 వరకు మరోసారి అవకాశం కల్పిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. కొన్ని మాధ్యమాలలో ప్రచారం జరుగుతున్నట్లు నవంబరు ఏడు చివరి తేదీ కాదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆమోదించిన షెడ్యూల్ ప్రకారం నవంబరు 23 నుంచి డిసెంబరు 9 వరకు అభ్యంతరాలను దాఖలు చేసే సమయంలో, ఫారం-18, 19ని సమర్పించడం ద్వారా దరఖాస్తుదారు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని మీనా పేర్కొన్నారు. మండలి ఎన్నికలకు సంబంధించి అయా నియోజకవర్గాలలో ఓటర్ల నమోదు పురోగతి , రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సంసిద్ధత తదితర అంశాలను సమీక్షించేందుకు అయా జిల్లాల కలెక్టర్లు, అసెంబ్లీ, శానన పరిషత్ నియోజకవర్గాల ఓటరు రిజిస్ట్రేషన్ అధికారులతో ప్రధాన ఎన్నికల అధికారి ఇప్పటికే దృశ్య శ్రవణ మాధ్యమ సదస్సును నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి శ్రీకాకుళం- విజయనగరం-విశాఖపట్నం పట్టభద్రులు, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయులు, కడప-అనంత పురం-కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయులు నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ జరుగుతోందని తొలి విడత దరఖాస్తుల స్వీకరణ తేదీ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాను నవంబరు 23న ప్రచురిస్తామని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

సంపాదకీయం

బీజేపీలో గుజరాత్ ఒణుకు

సర్వ స్వతంత్రంగా పని చేయవలసిన రాజ్యాంగపర బాధ్యత ఉన్న ఎన్నికల కమిషన్ ప్రస్తుతం మోదీ సర్కారు కనుసన్నల్లో మాత్రమే మెలగుతుందని మరోసారి రుజువు అయింది. సాధారణంగా వివిధ శాసనసభల గడువు ముగిసే కాలం మధ్య ఎక్కువ అంతరం లేకపోతే ఎన్నికలు జరగవలసి ఉన్న రాష్ట్రాలకు ఎన్నికల కమిషన్ ఒకే సారి ఎన్నికల తేదీలు ప్రకటిస్తుంది. కానీ 2023 జనవరి 8న శాసనసభ గడువు ముగియవలసిన హిమాచల్‌ప్రదేశ్‌లో ఈనెల 12వ తేదీన ఎన్నికలు జరుగుతాయని నిర్ణయించారు. 2023 ఫిబ్రవరి 18న గడువు ముగియాల్సిన గుజరాత్ శాసనసభ ఎన్నికలను మాత్రం హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలతో కలిపి నిర్వహించడం లేదు. దీనికి కారణం అందరికీ తెలిసిందే. 27 ఏళ్ల నుంచి గుజరాత్ లో అధికారంలో ఉన్న బీజేపీ ఆరు నూరైనా ఈ సారి గుజరాత్ లో అధికారం నిలబెట్టుకో వలసిందేనన్న పట్టుదలతో ఉంది. లేక పోతే 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయావకాశాలు గణనీయంగా తగ్గుతాయి. దేశాన్ని ఏలుతున్న ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇద్దరూ గుజరాత్‌కు చెందిన వారే. ఎన్నికలలో విజయం సాధించడానికి మోదీ నాయకత్వంలోని బీజేపీ సకల సన్నాహాలూ చేసుకోవడానికి తగిన వ్యవధి ఇవ్వడానికే ఎన్నికల సంఘం గుజరాత్ శాసనసభ ఎన్నికల తేదీలను హిమాచల్ ఎన్నికలతో పాటు ప్రకటించలేదు. తీరికగా గురువారం గుజరాత్ ఎన్నికల తేదీలను ఖరారు చేసింది. డిసెంబర్ ఒకటి, అయిదు తేదీల్లో గుజరాత్ శాసనసభ ఎన్నికలు జరుగుతాయి. హిమాచల్ ఎన్నికలు నవంబర్ 12న నే ముగిసినప్పటికీ ఫలితాలు మాత్రం గుజరాత్ ఫలితాలతో పాటు డిసెంబర్ 8ననే వెలువడతాయి. చెప్పినట్టు వినే ఎన్నికల కమిషన్ ఉంటే అంతకన్నా కావలసింది ఏముంటుంది? గుజరాత్ ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకు అని అడిగితే మోర్బీ వంతెన కూలడం అని ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి రాజీవ్ కుమార్ బధిరాంధులు కూడా నమ్మలేని సాకు చెప్పారు. వాతావరణ స్థితిని కూడా చూడాలిగా అన్నారు. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల కార్యక్రమం ప్రకటించినప్పుడు మోర్బీ దుర్ఘటన జరగలేదుగా! ఈ ప్రశ్నకు ఎన్నికల కమిషన్ దగ్గర సమాధానం లేదు. ఇటీవలి కాలంలో ప్రధానమంత్రి మోదీ గుజరాత్‌లో తరచుగా పర్యటించారు. ఎన్నికల కార్యక్రమం ఖరారైన తరవాత కొత్త పథకాలూ, వరాలు ప్రకటించడం కుదరదు కనక ఇవ్వాల్సిన వరాలన్నీ ఇచ్చేశారు. మోర్బీ దుర్ఘటన జరిగిన రోజు కూడా మోదీ గుజరాత్ లోనే ఉన్నారు. మోర్బీ దుర్ఘటన తరవాత ఆయన కళ్లనీళ్లు పెట్టుకున్నంత పని చేశారు. అవసరార్థం ఎప్పుడు కావాలంటే అప్పుడు కన్నీళ్లు కార్చే శక్తి మోదీకి ఉంది. ఒక వేపు మోర్బీ దారుణం దేశమంతటినీ కలచి వేస్తుంటే మోదీ ఎన్నికల ప్రచారం ఆపలేదు. హామీల వరద ఆగలేదు. 2002లో గుజరాత్ శాసనసభలో బీజేపీకి 127 సీట్లు ఉండేవి. అవి క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. 2017లో చావుతప్పి కన్ను లొట్ట పోయినట్టు బీజేపీకి దక్కింది కేవలం 99 స్థానాలు మాత్రమే. అంటే అవసరమైన మెజారిటీకన్నా ఆరేడు సీట్లు మాత్రమే బీజేపీకి ఎక్కువ దక్కాయి. రాను రాను గుజరాత్ లో బీజేపీ బలహీన పడుతోంది. అందుకే ఎలాగైనా ఆ రాష్ట్రాన్ని నిలబెట్టుకోవాలని మోదీ, అమిత్ షా ద్వయం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఎన్నికల కార్యక్రమ ప్రకటన జాప్యం చేసి ఎన్నికల కమిషన్ మోదీ నాయకత్వంలోని బీజేపీకి బాగా సహకరించింది.

హిమాచల్ ఎన్నికల గురించి బీజేపీకి అంత చింత లేదు. సర్వ శక్తులూ గుజరాత్ లోనే ఒడ్డుతోంది. ప్రధానమంత్రి మోదీ ఇక మీదట గుజరాత్ ఎన్నికల ప్రచారంలోనే నిమగ్నమై ఉంటారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగమంత్రి జై శంకర్‌తో పాటు దాదాపు పదిహేను మంది మంత్రులను గుజరాత్‌లో మోహరిస్తున్నారు. అంటే నవంబర్‌లో మూడువారాల పాటు కేంద్రమంత్రులు చాలామంది గుజరాత్ ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతుంటారు కనక దిల్లీలో పరిపాలన స్తంభించక తప్పదు. గుజరాత్‌లో తమ పరిస్థితి బలహీన పడ్తోందని గ్రహించిన మోదీ 2021 సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రితో సహా మంత్రివర్గంలో భారీ మార్పులుచేశారు. రూపానీ స్థానంలో భూపేంద్ర పటేల్‌ను ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టారు. అయినా అసలు మంత్రాంగం దిల్లీ పెద్దలే నడిపిస్తారు. గుజరాత్‌లో 33 జిల్లాలు ఉంటే 11జిల్లాల్లో మాత్రమే బీజేపీకి గట్టి పట్టుఉంది. 2017లో బీజేపీ సాధించిన 99 స్థానాల్లో 93 ఈ జిల్లాల్లోనివే. అంటే 22 జిల్లాల్లో బీజేపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జిల్లాల వారీగా చూసుకుంటే కాంగ్రెస్ కు 13 జిల్లాల్లో పట్టుంది. కాని వాటిలో చాలావరకు చిన్న జిల్లాలే. ఈ 13 జిల్లాల్లోని 59 సీట్లలో కాంగ్రెస్ 2017లో 46 సాధించింది. అయిదు జిల్లాల్లో బీజేపీ ఒక్క సీటైనా గెలవలేదు. అందుకే బలం ఉన్న జిల్లాల్లో, తక్కువ తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాలలో ఎక్కువ దృష్టి కేంద్రీ కరించాలని బీజేపీ అధినాయకత్వం నిర్ణయించింది. ఈ సారి కనీసం 120 సీట్లయినా సాధించాలన్నది బీజేపీ లక్ష్యం. మొన్నటి దాకా గుజరాత్ లో ప్రధానమైన పోటీ బీజేపీ-కాంగ్రెస్ మధ్య ఉండేది.

ఈసారి దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వం లోని ఆమ్ ఆద్మీ పార్టీ కూడా రంగంలో దిగింది కనక ముక్కోణపు పోటీ అనివార్యం. ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ ఓట్లను లాగేస్తే తమకేలాభం అని బీజేపీ అనుకుంటోంది. కేజ్రీవాల్ కనక హిందూఓట్లను చీలిస్తే బీజేపీకినష్టం. ఈసారి మతపరమైన చీలికలకోసం బీజేపీ అంతగా ప్రయత్నిస్తున్నట్టు లేదు. కుల సమీకరణల మీద శ్రద్ధ తీసుకుంటోంది. కానీ ఆదివాసులు, పాటిదార్లు, ముస్లింలు బీజేపీపై గుర్రుగా ఉన్నారు. వీరి జనాభా 35 శాతం దాకా ఉంటుంది. గుజరాత్ లో ఇతర వెనుక బడిన కులాలవారు (ఓబీసీలు) 48శాతం ఉన్నారు. ఆదివాసీలు 14.75 శాతం ఉన్నారు. పాటిదార్లు 11శాతం అయితే క్షత్రియులు 5శాతం ఉన్నారు. ముస్లింలు 9శాతం, దళితులు 7శాతం ఉన్నారు. ఈ గణాంకాల ఆధారంగానే కుల సమీకరణలు ఎలా ఉండాలో అని బీజేపీ మల్లగుల్లాలు పడ్తోంది. 27 ఏళ్ల పాటు అవిచ్ఛిన్నంగా అధికారంలో ఉన్నందువల్ల బీజేపీపై గుజరాత్ లో అసమ్మతి ఉండడం సహజం. గుజరాత్ లో ఓటమి మోదీ, అమిత్ షా ఓటమి కిందే లెక్క. భవిష్యత్తుకు అశుభ సూచకం. బీజేపీ అంచనాలను మోర్బీ దుర్ఘటన తలకిందులు చేసింది. అందుకే బీజేపీలో ఒణుకు మొదలైంది.

బంగారు బాల్యాన్ని చిదిపేస్తున్నామా...!?

మూడేళ్ల హర్ష హార్ట్ ఎటాక్‌తో మరణించాడు. తాను చదువుతున్న పాఠశాలలో ఏడేళ్ల యడ్ల నవీన్ విద్యుత్ షాక్‌తో మరణించాడు. 14 ఏళ్ల బాలచందర్ ఓ హత్యా నేరంలో అరెస్టు అయ్యాడు. ఇవన్నీ వార్తలే అయినా చదువుతున్న వాళ్ళకి దుఃఖం ఆగడం లేదు. ఇప్పుడు 50 లు, 60 లు వయసు దాటిన వాళ్ళం ఇలాంటి వార్తలని గతంలో ఎప్పుడైనా చదివామా..!? మూడేళ్ళ హర్షకి అసలు గుండె గురించి, అది పనిచేసే పద్ధతి గురించి తెలిసే అవకాశం ఉందా.. మూడేళ్ళ హర్షకి గుండెపోటు రావడం దైవ నిర్ణయమా..!?, మానవ తప్పిదమా..!? దైవ నిర్ణయమని సరిపెట్టుకుందామా. నాకైతే ఇది సమాజ నిర్లక్ష్యంగానే కనపడుతుంది. తన తల్లి గర్భంలో ఉండగానే ఆ చిన్నారి హర్ష ఎదుగుదలలోనే లోపం ఉండి ఉండాలి. ఆ తల్లి తీసుకున్న ఆహారంలో కల్తీ, పీల్చే గాలిలో కల్తీ, తాగే నీటిలో కల్తీ... ఇలా అన్నింటిలోను కల్తీతోనే బతుకుతున్నాం కదా. దీని ప్రభావం ఆ తల్లి పై పడదా. నేరం మనం చేస్తున్నాం. శిక్షలని చిన్నారులకు వేస్తున్నాము కదా. మన నేరానికి అభం శుభం తెలియని పసివారిని బలి తీసుకుంటున్నాము.

మొన్నటికి మొన్న కోనసీమ జిల్లాలో విద్యుత్ షాక్‌తో

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

పాఠశాలలోనే ఏడేళ్ల యడ్ల నవీన్ మృతి చెందాడు. ఓ కాంట్రాక్టర్ పట్టించుకోని కారణంగా నవీన్ బలయ్యాడు. బంగారు భవిష్యత్ ఉన్న నవీన్ అకాల మరణానికి సమాజం బాధ్యత తీసుకోవాలి కదా. అంటే ఇలాంటి జాగ్రత్తలు, బాధ్యత లేకుండా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి కదా. ప్రభుత్వం నవీన్ కుటుంబానికి పది లక్షలు పరిహారం ఇచ్చింది. మరి కాంట్రాక్టర్‌ని వదిలేయడమేనా... అతనిలా మరొకరు నిర్లక్ష్యంగా ఉండకుండా అతడిని శిక్షించాలి కదా. అబ్బే ఇక్కడ అలాంటివేమీ ఉండవు. ఇది బాల్యాన్ని చిదిమేయడమేగా.

పద్నాలుగేళ్ల బాలచందర్ హత్యానేరంపై అరెస్ట్ కావడం ఏమిటి. అసలు పద్నాలుగేళ్ల బాలచందర్ ఈ వయసులో ఏంచేస్తూ ఉండాలి. బాలచందర్ ఒక్కడే కాదు ఆ వయసు పిల్లలు ఏమి చేయాలి. చదువుతోనో, ఆటలతోనో ఉండాలి కదా. ఆ బాల్యంలోనే బాలచందర్ లాంటి పిల్లలకు గంజాయి, హెరాయిన్, మద్యం ఎవరు అందిస్తున్నారు. ఆ మత్తులో నేరాలకు పాల్పడడం ఎవరు నేర్పుతున్న సంస్కృతి. పబ్బులోను, మద్యం దుకాణాల వద్ద కనపడుతున్న చిన్నారులను మత్తులో దింపుతున్న సంస్కృతి ఏ దేశం నుంచి దిగుమతి చేసుకున్న కల్చర్. ర్యాంకుల పేరుతోనూ, తల్లితండ్రుల కలలు నెరవేర్చుకోవడం కోసమో బాల్యాన్ని చిదిమేస్తున్నది మనమే కదా. నేటి బాల్యానికి అరచేతిలో ఇమిడిపోయే ప్రపంచాన్ని ఇస్తున్నాం అనుకుంటున్నాం కానీ చిన్నారులు దాన్నే ప్రపంచంగా మార్చేసుకుంటున్నారనే వాస్తవాన్ని గుర్తించడం లేదు. మన చిన్నారుల బాల్యాన్ని నిర్వీర్యం చేస్తున్నది మన పెద్దలే. అసలవి రోగాలని కూడా తెలియని చిన్నారులకు ఆ వ్యాధులు సోకేలా చేసేది ఈ సమాజమే. బాల్యం గుజ్జనగూళ్ళను చిదిమేస్తున్నదీ ఈ చదువులే. దీపాలకు చేతులు అడ్డుపెట్టి కాపాడాల్సిన బాల్యం. నాకున్నవన్నీ ఇచ్చేస్తా నా బాల్యాన్ని నాకిచ్చేస్తావా అని సినారె ఓ గజల్‌లో అంటారు. తిరిగిరాని బాల్యాన్ని కాపాడుకుందాం.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్, 9912019929

పెద్ద నోట్ల రద్దుకు నేడూ అడ్డగోలు సమర్ధనలా!

సత్య

ప్రధాని నరేంద్రమోదీ నోట రెండోసారి పలికేందుకు ఇబ్బంది పడిన పెద్ద నోట్ల రద్దును సమర్థిస్తూ రిజర్వుబాంకు ద్రవ్య విధాన పర్యవేక్షక కమిటీ సభ్యురాలు, ఆర్థికవేత్త అషిమా గోయల్ ఇటీవల ముందుకు వచ్చారు. దేశ చరిత్రలో పెద్ద నోట్ల రద్దు జనానికి ఒక పెద్ద పీడకల, పాలకులకు ఘోర వైఫల్యం. దీని గురించి ఆరు సంవత్సరాల తరువాత ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ పెద్ద నోట్ల రద్దు లక్ష్యాన్ని సాధించిందా అన్న అంశాన్ని విచారించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష మీద తమకు ఉన్న లక్ష్మణరేఖ గురించి తెలుసునని కూడా కోర్టు పేర్కొన్నది. అందువలన ఈ కేసులో ఎలాంటి తీర్పు వస్తుందనే అంశం గురించి ఊహాగానాలు అవసరం లేదు. తీర్పు తీరు తెన్నులు ఎలా ఉన్నప్పటికీ పెద్ద నోట్ల రద్దు నిర్ణయ ఫలితాలు, పర్యవసానాల మంచి చెడ్డల గురించి జరిగే చర్చలో అనేక అంశాలు వెలుగులోకి వస్తాయి, పాలకుల మాటలను, నాటి పరిస్థితి, ప్రహసనాలను జనాలకు మరోసారి గుర్తుకు తెస్తాయి.

పెద్ద నోట్ల రద్దు బడా వైఫల్యమని తెలిసినప్పటికీ పన్ను వసూళ్ల పెరుగుదల వెనుక పెద్ద నోట్ల రద్దు ప్రక్రియ ఉన్నదని అషిమా గోయల్ పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అది నిజమా, ఆ వైఖరితో అందరూ ఏకీభవించాలా? అఫ్‌కోర్సు ఇదే తర్కం ఆర్థికవేత్తలందరికీ వర్తిస్తుంది కదా అని ఎవరైనా అనవచ్చు. నిజమే, ఎవరేం చెప్పినా వారు చెప్పినదానికి ప్రాతిపదికలే విశ్వసనీయతను వెల్లడిస్తాయి. ఇదే అషిమాకూ వర్తిస్తుంది. దేశంలో పెద్ద నోట్ల రద్దుకు ముందు- తరువాత పన్ను వసూళ్ల అంకెలు ఏమి చెబుతున్నాయి ? ఇలా అనేక అంశాలను చూడాల్సి ఉంది. పెద్ద నోట్ల రద్దు గురించి ఆర్‌బిఐ, కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీం కోర్టులో దాఖలు చేసే అఫిడవిట్లలో ఏమి చెబుతారన్నది ఆసక్తి కలిగించే అంశమే. అషిమా గోయల్ చెప్పిన అంశాల ప్రాతిపదిక, వాదనే వాటిలో ఉంటుందా ? చూద్దాం.

పెద్ద నోట్ల రద్దు ద్వారా నల్లధనాన్ని వెలికి తీస్తామని, ఉగ్రవాదులు, ఇతర విద్రోహశక్తులకు నిధులు అందకుండా చూస్తామని, సమాంతర ఆర్థిక వ్యవస్థ అంతు చూస్తామని, తెరవెనుక లావాదేవీలను బహిర్గతపరుస్తామని ప్రధాని నరేంద్రమోదీ 2016 నవంబరు 8 న పెద్ద నోట్ల రద్దు ప్రకటనలో చెప్పారు. "ప్రభుత్వ అధికారుల పరుపులకింద కరెన్సీ కట్టలు లేదా గోనెసంచుల్లో నగదు దొరికింది అనే వార్తలతో నిజాయితీపరులైన పౌరులు బాధపడకూడదనే" పెద్ద నోట్ల రద్దు విధానాన్ని ప్రకటించినట్లు చెప్పారు. లెక్కాపత్రం లేని ధనాన్ని పన్ను అధికారులకు వెల్లడించటం లేదా బ్యాంకుల్లో జమ మినహా మరొక

మార్గం లేదన్న ఎందరో దాన్ని అవినీతి, నల్లధనంపై మెరుపు దాడిగా పేర్కొన్నారు. ఆ తరువాత తెలంగాణాలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఇప్పుడు జరిగిన మునుగోడు ఉప ఎన్నికలో లెక్కా పత్రం లేని డబ్బు ప్రవాహాన్ని చూసిన తరువాత మోదీ అమాయకుడై అలా చెప్పారా లేక జనాలను వెంగళప్పలుగా భావించినట్లా ? ఇటీవలనే పశ్చిమ బెంగాల్ మంత్రి పార్థా చటర్జీ, అతని సన్నిహితురాలు అపర్ణా ముఖర్జీ ఇండ్లలో అధికారికంగా ప్రకటించిన రు.49.80 కోట్ల నగదు కట్టలు, ఐదు కోట్ల విలువైన బంగారం వారి వద్దకు ఎలా చేరినట్లు ? ఇది సముద్రంలో కాకిరెట్ట వంటిది. ఆ పెద్దమనిషి రాష్ట్రంలో అధికారంలో ఉన్నారు గనుక, మమతాబెనర్జీకి కూడా వాటా వుండి చూసీ చూడనట్లు ఉన్నారనుకుందాం, మరి కేంద్ర సంస్థలు ఏం చేస్తున్నట్లు ? నిజానికి చిత్తశుద్ధితో దాడులు చేస్తే దేశంలో అలాంటివి ఇంకా ఎన్ని దొరికేదీ చెప్పాల్సిన పని లేదు. పెద్ద నోట్ల రద్దు తరువాత కొంత ఇబ్బంది పడినప్పటికీ ఇప్పుడు దాని ఫలాలు అందుతున్నట్లు అషిమా చెప్పారు. ఫలాలంటే ఏమిటి ? ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణ జరిగింది, డిజిటైజేషన్ను పెంచింది, పన్నుల ఎగవేతను నిరోధించింది అని ఆమె చెప్పారు. గత ఏడాదితో పోల్చితే వర్తమాన ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్, వ్యక్తిగత పన్ను చెల్లింపు 24 శాతం పెరిగి రు.8.98 లక్షల కోట్లకు, జిఎస్‌టి గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే ఈ ఏడాది 26 శాతం చేరినట్లు అక్టోబరు 9 న పన్నుల శాఖ చెప్పిన అంశాన్ని ఆమె తన వాదనకు రుజువుగా పేర్కొన్నారు.

పెద్ద నోట్ల రద్దు వలన సుమారు నాలుగున్నర లక్షల కోట్ల మేర నగదు చలామణి నుంచి అదృశ్యమౌతుందని ఎస్‌బిఐ ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఉన్న సౌమ్యకాంతి ఘోష్ 2016 నవంబరు 14వ తేదీన బిజినెస్ స్టాండర్డ్ అనే పత్రికలో రాసిన విశ్లేషణలో పేర్కొన్నారు.(అంటే ఆమేరకు ప్రభుత్వానికి లబ్ది చేకూరినట్లే) అంతే కాదు ఇప్పటికే ఉన్న దిల్లీ పొగను మరింత పెంచేవిధంగా అంత మొత్తాన్ని తగుల పెట్టబోరనే చతురోక్తిని కూడా విసిరారు. అషిమా అభిప్రాయం కూడా అలాంటిదేనా? ఇద్దరూ ఆర్థికవేత్తలే కదా! చివరికి ఏమైంది, ఒక్కరంటే ఒక్కరు కూడా నోట్లు తగలబెట్టలేదు, పోపుల డబ్బాల్లో దాచుకొని నోట్ల రద్దు తెలియని వారు, ఇతర కుటుంబ సభ్యులకు తెలపకుండా కొంత మొత్తాలను దాచుకొని అవి వెల్లడైతే కుటుంబంలో కలతల గురించి భయపడినవారు తప్ప నల్ల ధనికులందరూ తమ సొమ్మును తెల్లగా మార్చుకున్నారని అధికారిక గణాంకాలే చెప్పాయి. ఆశించిన ఫలితాలు రాకపోవటంతో భంగపడిన అధికారపార్టీ పెద్దలు పెద్ద నోట్ల రద్దు వలన అసలెందుకు చేశారో చెప్పటం మానేసి దీని వలన డిజిటల్ చెల్లింపులు పెరిగాయి కదా అని వాదించారు. మొగుడు పోతే పోయాడు గానీ గుండు మాత్రం పొన్నకాయలా భలే ఉందే అన్న సామెతను గుర్తుకు తెచ్చారు. అది కూడా నిజం కాదు. కార్డుల ద్వారా చెల్లిస్తే రెండు శాతం అదనంగా వసూలు చేస్తుండటంతో జనాలు తిరిగి నగదుకే మొగ్గారు. అనేక దుకాణాల్లో యుపిఐ చెల్లింపులను అంగీకరించటం లేదు. కార్డులు లేదా యుపిఐ లావాదేవీలను పెంచేందుకు ప్రపంచంలో ఏ దేశంలో కూడా పెద్ద నోట్ల రద్దు అనే పిచ్చిపనులు చేయలేదు. కానీ కొందరు ఈ ఘనతను నరేంద్రమోదీకి ఆపాదించేందుకు మరోసాకు లేక పెద్ద నోట్ల రద్దుకు ముడిపెట్టారు.

పెద్ద నోట్ల రద్దు గురించి దివంగత అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిగా 2017 ఫిబ్రవరి రెండున పార్లమెంటులో చేసిన ప్రసంగంలో చెప్పిందేమిటి ? 2016 నవంబరు ఎనిమిది నుంచి డిసెంబరు 30 వరకు రెండు నుంచి 80 లక్షల వరకు డిపాజిట్లు చేసిన ఖాతాలు 1.09 కోట్లు కాగా ఒక్కొక్క ఖాతా సగటు మొత్తం రు.5.03 లక్షలు, 80 లక్షలకు మించి దాఖలు చేసిన ఖాతాలు 1.48 లక్షలు, వీటి సగటు రు.3.31కోట్లు. వీటిని మరొకవిధంగా చెప్పారు కొందరు. రు.80లక్షల లోపు డిపాజిట్లు చేసిన ఖాతాల్లో చేరిన మొత్తం రు.5.48 లక్షల కోట్లు కాగా అంతకు మించి చేసిన ఖాతాల మొత్తం రు.4.89 లక్షల కోట్లు.ఆర్‌బిఐ ప్రకటించిన దాని ప్రకారం 99 శాతం పైగా నగదు వెనక్కు వచ్చింది, రద్దు చేసిన నోట్ల విలువ రు.15.44 లక్షల కోట్లు. మూడో వంతు (31శాతం) సొమ్ము రు.4.89 లక్షల కోట్లు 80 లక్షలకు పైగా డిపాజిట్లు కేవలం 1.48లక్షల మంది నుంచే వచ్చిందంటే నోట్లరద్దు వలన లబ్ది పొందింది నల్ల మహా ధనికులా మరొకరా ?

ప్రజాస్వామ్య, సెక్యులర్ విలువలే రక్ష

భారతీయ సమాజం విభిన్న సంస్కృతుల సమ్మేళనం. భిన్నకులాలు, భిన్నమతాలు, భిన్నవర్గాలు, భిన్న సంప్రదాయాలు అనాదిగా ఇక్కడ సహజీవనం చేస్తున్నాయి. మనదేశంలో ఉన్నన్ని కులాలు, మతాలు ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేవు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న ఏకైక దేశం భారతదేశమే. భారతదేశ ప్రజలు స్వతహాగా శాంతికాముకులు. మత సామరస్యానికి, మానవీయ విలువలకు పెట్టిందిపేరు. ఇటీవలి కాలంలో దేశంలో సహజీవనానికి, శాంతియుత వాతావరణానికి, తూట్లు పొడిచే కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. అన్నదమ్ముల్లా కలసీ మెలసీ బతుకుతున్న సోదర సమూహాల మధ్య చిచ్చు పెట్టి తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ఎంతటి నీచత్వానికైనా దిగజారే పరిస్థితులు మనం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో విద్వేషకారులపై సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు కాస్తంత ఊరట కలిగిస్తున్నాయి. 'దేశంలో విద్వేష పూరిత వాతావరణం నెలకొన్నది, కొన్ని అంశాల్లో దృష్టి మరల్చేందుకు కొందరు ఇలాంటి ప్రసంగాలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదు. విభిన్న మతాలు, విభిన్న కులాలు సామరస్య పూర్వక వాతావరణంలో జీవించకపోతే సౌభ్రాతృత్వాన్ని సాధించలేం. దేశ లౌకిక, ప్రజాస్వామ్య తత్వాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది. అది మా విధి. ఇది 21 వ శతాబ్దం. కానీ మతం పేరుతో మనం ఎక్కడికి చేరుకున్నాం. లౌకిక రాజ్యంగా ఉండాల్సిన భారత దేశంలో ప్రస్తుత పరిణామాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. భారతదేశం లౌకిక, సౌభ్రాతృత్వ దేశంగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. ప్రతి వ్యక్తి గౌరవానికి భరోసా కల్పించాలని, దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడాలని రాజ్యాంగ పీఠికలోని మార్గదర్శక సూత్రాలు పేర్కొంటున్నాయి'. అంటూ తీవ్ర ఆగ్రహంతో కూడిన, ఆవేదనా పూరిత వ్యాఖ్యలు చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో మతోన్మాద శక్తులు పెట్రేగిపోవడాన్ని, విద్వేషపూరిత ప్రసంగాల ద్వారా అమాయక ప్రజల్ని రెచ్చగొట్టి కలహాలు సృష్టించడాన్ని మనం చూస్తున్నాం. నరేంద్రమోదీ దేశ పగ్గాలు చేపట్టిన తరువాత ఈ ధోరణి మరింతగా పెరిగిపోయింది. మోదీ అండ చూసుకొని పరివార్ శక్తులు పట్టపగ్గాలు లేకుండా పెట్రేగిపోతున్నాయి. ఈ విచ్ఛిన్నకర శక్తులు తమ దీర్ఘకాల రాజకీయ ప్రయోజనాలకోసం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ, సమాజాన్ని కాషాయీకరించే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్లు, అధికారం ఉన్నప్పుడే 'అనుకున్నవి' సాధించుకోవాలని పరివార్ శక్తులు భవిష్య ప్రణాళికను రచించుకున్నాయి. వీలు చిక్కినప్పుడల్లా వివాదాలు సృష్టించి పైశాచిక ఆనందం పొందుతున్నాయి.



ధర్మసంసద్ పేరుతో ఎంత అధర్మానికి పాల్పడినా, ఎంత బరితెగింపునకు దిగినా అడిగేవారు లేకుండా పోయారు. అందుకే సుప్రీం ధర్మాసనం ఇలాంటి విద్వేష ప్రసంగాలపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేసింది. మత ప్రాతిపదికపై ప్రజలను చీల్చడమే లక్ష్యంగా సాగుతున్న విద్వేష ప్రచారాన్ని, సహించరాదని, ఆ తరహా ప్రచారం/ప్రసంగాలు చేసేవారిని విడిచిపెట్టకూడదని, వారిపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా సుమోటోగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. అంతేకాదు, తమ ఆదేశాలను పట్టించుకోకుండా ప్రభుత్వ యంత్రాంగం జాప్యం చేస్తే కోర్టు ధిక్కరణగా భావించాల్సి వస్తుందని కూడా హెచ్చరించింది. ఇది 21 వ శతాబ్దమని, మతం పేరుతో, దేవుడు పేరుతో మనం మధ్య యుగాల అజ్ఞానంలోకి వెళుతున్నామా అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య లౌకిక దేశంలో కులాలు, మతాలకు అతీతంగా వ్యవహరించాల్సింది పోయి, బూజు పట్టిన బుర్రలతో ఆలోచించడం దురదృష్టకరం. మన రాజ్యాంగం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని చెబుతోంది. కాని దేశంలో దానికి భిన్నంగా మతోన్మాద, విద్వేషపూరిత వాతావరణం నెలకొంది. మౌలిక అంశాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు ఇలాంటి దుర్మార్గాలకు తెగబడుతున్నారు. ఇటువంటి వాటిని సహించలేమని కూడా అని జస్టిస్ కె.ఎం జోసెఫ్, జస్టిస్ హృషికేష్‌రాయ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తరహా కేసుల్లో ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు తెలపాలని యూపీ, ఉత్తరాఖండ్, దిల్లీ ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు జారీచేసింది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరుచుకుని తగు చర్యలు చేపడతారా?

- యండి.ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

ఢిల్లీ ఉక్కిరి బిక్కిరి

డాక్టర్.ఎం.సురేష్‌బాబు

దేశ రాజధానిలో వాయు నాణ్యత సూచీ 500 దాటింది. ప్రపంచంలో నివాసయోగ్యం కాని నగరాలు ఏదైనా ఉన్నదా అంటే దీనికి సమాధానం దిల్లీ అని చెప్పవచ్చు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. దిల్లీ, యుపి, హర్యానా పంజాబ్ రాష్ట్రాలలో పంటలను తగులపెట్టడం వలన అలాగే పరిశ్రమల నుండి వెలువడుతున్న విష వాయువుల వల్ల విపరీతమైన దుస్థితి ఏర్పడింది. ఈ పాపం నాది కాదు అంటే నాది కాదని రాష్ట్రాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. రూపాయి విలువ దిగజారలేదని డాలర్ విలువ పటిష్టమైందని ఆర్థిక మంత్రి సెలవిస్తారు. గుజరాత్‌లో మొర్బా నగరంలో హ్యాంగింగ్ బ్రిడ్జి కూలి 141 మంది చనిపోతే నా భాద్యత కాదని స్వయానా ఆ రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ మంత్రి, రైతులు పంట వ్యర్థాలను తగలబెడితే నాకేమి సంబంధమని పంజాబ్ ముఖ్యమంత్రి ఇలా ప్రతి ఒక్కరు బాధ్యతలు విస్మరించి నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. కొత్తగా ముద్రించే కరెన్సీ నోట్లపై లక్ష్మీదేవి ఫొటోతో పాటు వినాయకుడి ఫొటోను ముద్రించాలని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కరెన్సీ నోట్లపై ఒకవైపు మహాత్ముడి ఫొటో, మరోవైపు లక్ష్మీదేవి, వినాయకుడి ఫొటోలను ముద్రించవచ్చని చెప్పారు. ముస్లిం దేశమైన ఇండోనేషియాలో కరెన్సీ నోట్లపై మన గణేషుడి ఫొటో ఉండగా లేనిది మనం మాత్రం మన కరెన్సీపై ఎందుకు ముద్రించకూడదని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఒక్కొక్కసారి మనం ఎంత కష్టపడ్డా ఫలితం మాత్రం దక్కదని కేజ్రీవాల్ గుర్తుచేశారు. అలాంటి సమయాల్లో మన శక్తియుక్తులకు దైవానుగ్రహం కూడా తోడైతే ఫలితం దక్కుతుందని ఆయన వివరించారు. మరి వాయు నాణ్యత మెరుగుపడడానికి ఏ దేవుణ్ణి కొలవాలో ఎవరిని ఫొటో పెట్టి పూజించాలో సెలవిస్తే మంచిది. దిల్లీలో ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వాయుకాలుష్యం శుక్రవారం వాయు నాణ్యత సూచీ 456, అలాగే పీల్చదగిన ధూళి కణాలు 525, నైట్రోజెన్ డయాక్సయిడ్ 36, సల్ఫర్ డయాక్సయిడ్ 15, ఓజోన్ 75, కార్బన్ మోనాక్సయిడ్ 24 గా ఉంది. మరికొద్ది రోజులు సైతం ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా వయోజనులు, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దిల్లీ సహా పరిసర ప్రాంత ప్రజలు గడపదాటి బయటకు రావాలంటే మాస్కు ధరించక తప్పని పరిస్థితి నెలకొంది. ఇందుక్కారణం కరోనా కొత్త వేవ్ కాదు. కోరలు చాచిన వాయు కాలుష్యం ఈ దుస్థితిని తీసుకొచ్చింది. చలికాలం వచ్చిందంటే చాలు దిల్లీలో పీల్చే గాలి విషంగా మారుతుంది. రుతుపవనాల తిరోగమనం

అనంతరం ఉత్తరాదిన ఏర్పడే ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే మానవ తప్పిదాలు ఈ వాయుకాలుష్యం స్థాయిలను మరింత పెంచి పీల్చేగాలిని విషతుల్యం చేస్తున్నాయి.

దిల్లీ నగరంలోని వాహన ఉద్గారాలకు తోడు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానాలో రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల ఏర్పడే పొగ శీతాకాలంలో సహజసిద్ధంగా ఏర్పడే పొగమంచులో కలిసిపోయి ఊపిరి పీల్చుకోలేని ఉక్కిరిబిక్కిరి పరిస్థితిని సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణ పనుల కారణంగా ఏర్పడే దుమ్ము, ధూళి అన్నీ కలగలిపి గాలి నాణ్యతను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. కాలుష్య నియంత్రణ యంత్రాంగం లేక, ప్రజలకు కాలుష్యం దుష్ప్రభావాలు తెలియక తీవ్ర సమస్యలు కొని తెచ్చుకొంటున్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి. ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి సమతుల్యంగా ఉంటేనే వన్యప్రాణి వ్యవసాయానికి, మానవుని అభివృద్ధికి తోడ్పడుతుంది. కరోనా పారదోలడానికి యజ్ఞాలు యాగాలు, లైట్లు ఆర్పి మొబత్తి వెలిగించి, చప్పట్లు కొట్టి వైరస్ ని నియంత్రించవచ్చు, కాషాయాలు తాగి స్వస్థత చేకూర్చుమని ప్రజలకు సలహాలిస్తున్న దేశంలో ఆర్థిక పరిస్థితి బాగుపడాలంటే లక్ష్మీదేవి ఫోటో పెడితే ఆర్థిక రంగం పరిగెడుతుంది అన్న మేధావులున్న దేశంలో కాలుష్య సమస్యకు పరిష్కారం దొరక్కపోదు.

డిసెంబరు4న ఢిల్లీ మున్సిపల్ ఎన్నికలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యింది. డిసెంబర్ 4న పోలింగ్ జరగనుందనిఢిల్లీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ విజయ్ దేవ్ శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. 7న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 14న నామినేషన్ల గడువు ముగియనుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి ఈ నెల 19 ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున నేటి నుంచే ఢిల్లీలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని విజయ్ దేవ్ తెలిపారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మొత్తం 68 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్నదని ఎన్నికల కమిషనర్ విజయ్ దేవ్ చెప్పారు. మొత్తం 250 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని, అందులో 42 వార్డులు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలని ఆయన తెలిపారు.

యువతకు లక్ష ఉద్యోగాలు

- పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ
- హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక హామీ

కంగ్రా: కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెడితే లక్షమందికి ఉద్యోగాలు కల్పిస్తామని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందిస్తామని ఆ పార్టీ నాయకురాలు ప్రియాంకగాంధీ వాద్రా హామీ ఇచ్చారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన భారీ బహిరంగ సభలో ప్రియాంక మాట్లాడారు. యువత జీవితాలను నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిపై కాంగ్రెస్ పోరాడుతుందని ప్రియాంక భరోసా ఇచ్చారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ బీజేపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని నిందించారు. రాష్ట్రంలో 63 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. చత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఆ రాష్ట్రాల్లో మాదిరిగా హిమాచల్‌ప్రదేశ్‌లోనూ ప్రజారంజక పాలన అందిస్తామని ప్రియాంక తెలిపారు. 'కాంగ్రెస్ లక్ష ఉద్యోగాలు సృష్టిస్తుంది. చత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘెల్ ఇక్కడే ఉన్నారు. మూడేళ్లలో ఆయన యువతకు ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 1.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చింది' అని ప్రియాంక వివరించారు. చత్తీస్‌గఢ్‌లో నిరుద్యోగ రేటు అతి తక్కువగా ఉందన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే హిమాచల్‌ప్రదేశ్ యువతకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తూ మొదటి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటుందని ప్రియాంక తెలిపారు. ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇది తమ కచ్చితమైన హామీ అని తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపైనా మొదటి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. మహిళలపై ఆర్థికభారం బాగా పడుతుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని హర్‌ఘర్ లక్ష్మి యోజన కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థికసాయం అందిస్తామని చెప్పారు.

మన కృషికి గుర్తింపు

విద్యారంగంలో కేరళ టాప్‌పై విజయన్

తిరువనంతపురం: విద్యారంగ ప్రమాణాలకు సంబంధించి కేరళలోని వామపక్ష ప్రభుత్వం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ప్రకటించిన గ్రేడింగ్ ఇండెక్స్‌లో 928 పాయింట్లతో కేరళ అగ్రస్థానం సాధించింది. దీనిపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సంతోషం వ్యక్తంచేశారు. విద్యావ్యవస్థ ప్రమాణాల మెరుగుదలకు వామపక్ష ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది గుర్తింపు అని విజయన్ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని విజ్ఞాన సమాజంగా మార్చడానికి చేస్తున్న కృషికి మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అనేక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పాఠశాల విద్యను అంచనా వేసి కేంద్ర ప్రభుత్వం ర్యాంకులు ప్రకటించడం సర్వసాధారణం. విద్యారంగంలో కేరళ సాధించిన విజయం మనకు ప్రోత్సాహకరంగా ఉంటుందని, రాష్ట్రాన్ని విజ్ఞాన సమాజంగా మార్చడానికి మన ప్రయత్నాలకు ఇది బలం చేకూరుస్తుందని విజయన్ శుక్రవారం ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. జిల్లాస్థాయిలో పాఠశాల విద్యపై సమగ్ర విశ్లేషణ చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌ను కేంద్రం ప్రకటిస్తుంది. ప్రభుత్వ విద్య ప్రమాణాలు పెంచడానికి వామపక్ష ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

21 రోజుల శిశువు కడుపులో 8 పిండాలు

రాంచీ: ఇరవై ఒక్క రోజుల వయసున్న శిశువు కడుపులో ఏకంగా ఎనిమిది పిండాలు కనిపించాయి. సీటీ స్కాన్ తీసిన వైద్యులే నోరెళ్లబెట్టిన ఈ ఘటన జార్ఖండ్‌లో వెలుగుచూసింది. రామ్‌గఢ్‌లో అక్టోబరు 10న ఆడ శిశువు జన్మించింది. పాప అస్వస్థతకు గురవడంతో స్కానింగ్ తీస్తే పొట్టలో కణితి ఉన్నట్లు వైద్యులు భావించారు. ఆపరేషన్ చేసి ఎనిమిది పిండాలను బయటకు తీశారు. ఇది చాలా అరుదైన కేసు అని.. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి ఇప్పటిదాకా 200లోపు కేసులే వెలుగుచూశాయని, భారత్‌లో ఇలాంటివి 10 మాత్రమే నమోదయ్యాయని వైద్యులు చెప్పారు. 10 లక్షల మంది పిల్లల్లో ఒకరికి ఇలా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

శివసేన నేత దారుణ హత్య

అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో శుక్రవారం పట్టపగలే దారుణం జరిగింది. శివనేత నేత సుధీర్ సూరి హత్యకు గురయ్యారు. గోపాల్ దేవాలయం సమీపంలోని మజీతా రోడ్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తి సుధీర్‌పై కాల్పులు జరపడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలారు. ఆలయం వెలుపల ఉద్ధవ్ థాకరే శివసేన వర్గానికి చెందిన కొందరు నేతలు నిరసన తెలుపుతుండగా అక్కడి గుంపులోంచి ఒక వ్యక్తి కాల్పులు జరిపినట్టు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. కాల్పులకు ఉపయోగించిన పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. షూటింగ్ ప్రదేశం వద్ద ఒక వ్యక్తి కాల్పులు జరుపుతూ కెమెరాకు చిక్కాడు. ఇద్దరు వ్యక్తులు కారు నుంచి దిగి కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. కాల్పుల ఘటన అనంతరం స్థానిక నేతలు నిరసనలకు దిగారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి నుంచి పంజాబ్‌లో శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలినట్టు శివసేన పంజాబ్ అధ్యక్షుడు యోగిరాజ్ శర్మ ఆరోపించారు.

పురిటిలో మృత్యుఘోష

వైద్యుల నిర్లక్ష్యం, తల్లీ కవలల మృతి

తుమకూరు(కర్ణాటక): తమిళనాడుకు చెందిన ఓ నిరుపేద మహిళ, ప్రసవ నొప్పి రావడంతో చేర్చుకునేందుకు తుమకూరు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిరాకరించారనీ, ఆమె కవలలకు జన్మనిచ్చి, గురువారం మరణించినట్టు స్థానికులు తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా ఆరోగ్య అధికారి (డీహెచ్ఓ) డాక్టర్ మంజునాథ డ్యూటీ డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని సిఫార్సు చేశారు. స్థానికుల కథనం మేరకు కస్తూరి(30) స్థానిక భారతినగర్‌లో మరో నిరుపేద బాలికతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తోంది. బుధవారం సాయంత్రం కస్తూరికి ప్రసవ నొప్పులు రావడంతో పక్కింటివారు కొంత డబ్బు సమకూర్చి ఆటో రిక్షాలో తుమకూరు జిల్లా ఆసుపత్రికి పంపించారు. ఆమెకు ఆధార్ కార్డు, ప్రసూతి కార్డు లేవని చెప్పి వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఆమెను చేర్చుకునేందుకు నిరాకరించారని ఆరోపించారు. బెంగుళూరులోని విక్టోరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తూ స్లిప్ రాసిస్తానని డ్యూటీ డాక్టర్ చెప్పాడని పేర్కొన్నారు. నొప్పులతో యాతన పడుతున్న మహిళ ఇంటికి తిరిగి వచ్చింది. గురువారం ఉదయం మళ్లీ నొప్పులు తీవ్ర తరం కావడంతో ఒక బిడ్డకు జన్మనిచ్చి, మరో బిడ్డకు జన్మనిస్తుండగా, తీవ్ర రక్తస్రావంతో మృతి చెందింది. రోగిని చేర్చుకునేందుకు నిరాకరించిన డ్యూటీ డాక్టర్‌ని సస్పెండ్ చేయాలని సిఫారసు చేసినట్లు డాక్టర్ మంజునాథ పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్టు వివరించారు.

మేయర్, కార్పొరేటర్ల నిరసన: ఈ దారుణంపై స్థానిక ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 22వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాస్, మేయర్ ప్రభావతి, డిప్యూటీ మేయర్ టి.కే.నరసింహమూర్తి, కార్పొరేటర్ నయాజ్ అహ్మద్‌లు బాధితురాలి ఇంటికి వెళ్లి చుట్టుపక్కలవారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. తల్లీపిల్లల మృతదేహానికి నివాళు లర్పించారు. జిల్లా ఆస్పత్రి వైద్యులు, డిహెచ్ఈ ఇక్కడికి వచ్చేదాకా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది, వైద్యులు అందరు లంచాలకు అలవాటు పడి సక్రమంగా వైద్యం చేయడంలేదని, ఆస్పత్రి మొత్తం అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ వీణా వచ్చి ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. కస్తూరికి తల్లి కార్డు లేక పోవడంతో వెనక్కి పంపించారని చెప్పారు. గర్భిణి ప్రతినెలా ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయంచుకునే సమయంలో వారికి తల్లి కార్డు ఇస్తారని అన్నారు. ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటామని, దీనికి ఎవరు బాధ్యులు అనేదానిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

గుజరాత్‌లో ఆప్ సీఎం అభ్యర్థి ఇసుదాన్ గఢ్వీ

న్యూఢిల్లీ: పంజాబ్ తరహాలోనే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కీలక నిర్ణయం తీసుకుంది. గుజరాత్‌లో తమ పార్టీ సీఎం అభ్యర్థిగా టీవీ యాంకర్‌గా పనిచేసిన ఇసుదాన్ గఢ్వీని ఎంపిక చేసింది. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ప్రకటించారు. పంజాబ్ తరహాలోనే గుజరాత్‌లోనూ సీఎం అభ్యర్థి ఎంపిక కోసం ఆప్ నిర్వహించిన పోల్‌లో 40 ఏళ్ల గఢ్వీకి 73 శాతం ఓట్లు వచ్చాయని కేజ్రీవాల్ వెల్లడించారు. ఈ పోటీలో పాటిదార్ కమ్యూనిటీ ఆందోళనలో కీలక పాత్ర పోషించిన ఆప్ గుజరాత్ ఇన్‌చార్జి గోపాల్ ఇటాలియా కూడా ఉన్నప్పటికీ.. గుజరాతీలు గఢ్వీ వైపే మొగ్గు చూపారు. గఢ్వీ ద్వారకా జిల్లా పిపాలియా గ్రామంలోని ఓ రైతు కుటుంబంలో జన్మించారు. గుజరాత్ జనాభాలో 48 శాతంగా ఉన్న ఓబీసీ వర్గానికి చెందిన వ్యకి. అయితే, పంజాబ్‌లో భగవంత్ మాన్‌ను సీఎం అభ్యర్థిగా ఎంచుకున్న చందంగానే గుజరాత్‌లోనూ ఆప్ ఓ ఫోన్ నంబర్‌ను ఏర్పాటు చేసి ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది. గఢ్వీ గుజరాత్‌లో అత్యంత ప్రజాదరణ గల టీవీ జర్నలిస్టు, యాంకర్లలో ఒకరుగా ఉన్నారు.కాగా, గతేడాది జూన్‌లోనే ఆప్‌లో చేరిన 40 ఏళ్ల గఢ్వీ.. తన పేరును సీఎం అభ్యర్థిగా కేజ్రీవాల్ ప్రకటించడంతో ఉద్వేగానికి లోనయ్యారు. 'నాలాంటి రైతు బిడ్డకు కేజ్రీవాల్ ఇంత పెద్ద బాధ్యత అప్పగించారు. నేను చేయగలిగినంత మంచి చేస్తాను. భగవంతుడు నాకు అన్నీ ఇచ్చాడు. ఇప్పుడు నా తోటి గుజరాతీలకు అవసరమైనవి ఇవ్వాలనుకుంటున్నా. నా తుది శ్వాస దాకా ప్రజలకు సేవ చేస్తా' అని వ్యాఖ్యానించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. డిసెంబర్ 1, 5 తేదీల్లో ఎన్నికలు జరగనుండగా...డిసెంబర్ 8న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

తీహార్ జైల్ డీజీ బదిలీ

న్యూఢిల్లీ: తీహార్ జైల్ డైరెక్టర్ జనరల్ (జైళ్లు) సందీప్ గోయెల్ బదిలీ అయ్యారు. జైలులో ఉన్న తన రక్షణ కోసం రూ.10 కోట్లు డిమాండ్ చేశాడని కన్మాన్ సుకేశ్ చంద్రశేఖర్ ఆరోపించిన కొద్ది రోజుల తర్వాత ఈ బదిలీ జరిగింది. శుక్రవారం జారీ చేసిన అధికారిక ఉత్తర్వు ప్రకారం, 1989 బ్యాచ్ ఏజీఎంయూటీ కేడర్ గోయెల్‌ను తీహార్ జైలు నుంచి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీహెచ్‌క్యూలో రిపోర్ట్ చేయాల్సిందిగా కోరారు. కొత్త డీజీగా 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సంజయ్ బెనివాల్‌ను నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జైలులో తనకు భద్రత కల్పించేందుకు ఆప్ నేత సత్యేందర్ జైన్ 2019లో తన నుంచి రూ.10 కోట్లు లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ చంద్రశేఖర్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ రాశారు. రూ. 200 కోట్ల మనీలాండరింగ్ కేసులో స్థానిక మండోలి జైలులో ఉన్న చంద్రశేఖర్, ఆప్ నేతపై ఆశ్చర్యకరమైన ఆరోపణలు చేస్తూ తన న్యాయవాది అశోక్ కె సింగ్ ద్వారా అక్టోబర్ 8న ఎల్‌జీకి లేఖ సమర్పించారు.

ముఖంపై 'కాంతారా' పెయింటింగ్... యువతి క్షమాపణకి జరిమానా

మంగళూరు: 'కాంతారా' చిత్రాన్ని అనుకరిస్తూ 'దైవ ముఖవర్ణికే' అంటూ సోషల్ మీడియాలో దుమ్మెత్తి పోసిన హైదరాబాద్‌కు చెందిన ఓ యువతికి ధర్మస్థలంలోని మంజునాథ ఆలయం జరిమానా విధించింది. తక్షణమే 'ధర్మాధికారి' డీ వీరేంద్ర హెగ్డేకు క్షమాపణలు చెప్పాలని సూచించింది. 'కాంతారా'లోని దైవ పాత్రను పోలి ఉండేలా ఆ మహిళ తన ముఖానికి రంగులు వేసుకుంది. అయితే, ఆమె దైవరాధక (ఆరాధకుడు) పాత్రను చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు యక్షగాన వేషధారణను చిత్రీకరించింది, ఇది తీర ప్రాంతంలోని నెటిజన్లు తీవ్రంగా విమర్శించారు. దీనిపై ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. యక్షగాన వేషధారణను దైవ ముఖవర్ణికే అని తప్పుబట్టి తప్పిదానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనికి సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవడంతో ఆమె తన తప్పును గ్రహించి, దైవారాధకులు, తీరప్రాంత కర్ణాటక ప్రజలకు క్షమాపణలు చెప్పింది. రిషబ్ శెట్టి తీసిన బ్లాక్ బస్టర్ కన్నడ చిత్రం 'కాంతారా', కర్ణాటకలోని దక్షిణ కన్నడ ప్రాంతంలో 'దైవరాధనే'పై ఉన్న సంప్రదాయ విశ్వాసాల నేపథ్యంలో ప్రకృతితో మనిషికి జరిగే సంఘర్షణను చిత్రం చూపింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆస్తులపై ఐటీ దాడులు

రాంచి/న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుమార్ జైమంగళ్, ప్రదీప్ యాదవ్ ఇళ్లు, కార్యాలయాల్లో ఆదాయపన్నుశాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించారు. జైమంగళ్ బెర్మో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జేవీఎం-పి చీలిక అనంతరం యాదవ్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయన పోరియహత్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉంది. శాసనసభ్యులకు చెందిన రాంచి, బెర్మో, పాట్నాలలో గల ఆస్తులను అధికారులు తనిఖీలు చేశారు. చైబాసాలోని ఇనుప వ్యాపారి సహా కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లల్లోనూ ఆదాయపన్నుశాఖ దాడులు చేసినట్లు అధికారులు తెలిపారు. పన్నుఎగవేత ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా ఐటీశాఖ అధికారులు తనిఖీలు చేశారని, ఐటీశాఖకు తాను పూర్తిగా సహకరించానని జైమంగళ్ తెలిపారు. వాస్తవంగా బీజేపీ ఒత్తిడితోనే ఈ తనిఖీలు జరిగాయని, బీజేపీ వ్యతిరేకులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. తాను బీజేపీకి వ్యతిరేకమని, అందువల్ల ఇలాంటి దాడులు ఎదుర్కొంటున్నానని, దాడులకు భయపడేది లేదని జైమంగళ్ చెప్పారు. బీజేపీ యేతర ప్రభుత్వాలను అస్థిరపరచడంలో భాగంగానే ఐటీ దాడులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ఆరోపించారు. ఐటీశాఖ రాజ్యాంగబద్ధ సంస్థ అని, దానిపై తమకు గౌరవం ఉందని, అయితే, దాడులు చేసిన సమయమే అనుమానాలు రేకెత్తిస్తోందని చెప్పారు.

పంట దుబ్బుల దహనం రాజకీయ సమస్య కాదు

నియంత్రణకు చర్యలు తీసుకోండి

నాలుగు రాష్ట్రాలకు తోమర్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: పంట దుబ్బుల దహనం... రాజకీయ సమస్య కాదని వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పేర్కొన్నారు. ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుతున్న నేపథ్యంలో కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రప్రభుత్వం నిధులు, యంత్రాలు అందించినప్పటికీ ఢిల్లీ పొరుగు రాష్ట్రాల్లో ఇటువంటి సంఘటనలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని పంజాబ్, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న పరిష్కారాలు ఉపయోగించాలని సూచించారు. పూసా డీకంపోజర్ అనే బయో-డీకంపోజర్ టెక్నిక్‌ను ఉపయోగించడం ద్వారా సాధారణం కంటే ఎంతో వేగంగా పంట దుబ్బులను కంపోస్ట్ ఎరువుగా మార్చవచ్చని తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) అభివృద్ధిపర్చిన పూసా డీకంపోజర్...తక్కువ ధరకు లభించడమే కాక ఉపయోగించడానికి సులభంగా ఉంటుందన్నారు. దీనిని ఉపయోగించినట్లయితే పంట దుబ్బులను కాల్చే పని ఉండదని, భూసారం, ఉత్పాదకతను ఇది మెరుగుపరుస్తుందని ఆయన వివరించారు. పంట దుబ్బుల దహనం... అనంతర పరిస్థితులపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వారం రోజుల క్రితం సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తోమర్ తెలిపారు. ఆయా ముఖ్యమంత్రులు ఈ విషయంపై తదుపరి చర్చలు జరపాలని భావిస్తే అందుకు తాను సిద్ధమని ప్రకటించారు.

అటవీప్రాంతానికి చిరుతల తరలింపునకు సన్నాహాలు

భోపాల్: మధ్యప్రదేశ్ కునో జాతీయ పార్క్‌లో ప్రస్తుతం క్వారంటైన్‌లో ఉన్న ఎనిమిది చిరుతల(చీతాలు)ను నవంబర్ 5 తర్వాత పెద్ద అటవీప్రాంతంలో (బోమా) కి మార్చే అంశాన్ని పరిశీలిస్తామని మధ్యప్రదేశ్ అటవీ శాఖ సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. నమీబియా నుంచి చిరుతలను తీసుకొచ్చి 50 రోజులు పూర్తయ్యాయి. సెప్టెంబరు 17న దక్షిణాఫ్రికాలోని నమీబియా నుంచి చీతాలను ఇక్కడకు తీసుకొచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వాటిని క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లలోకి విడిచిపెట్టారు. 'నవంబర్ 5 తర్వాత ఎనిమిది చిరుతలను పెద్ద ఆవరణలోకి తరలించడానికి ముందు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించడానికి నేను కునోకి వెళ్తున్నాను మరో రెండు రోజుల్లో ఇక్కడి వాతావరణానికి అలవాటు పడి పూర్తి సౌకర్యంగా ఉన్న ఒకటి లేదా రెండు చిరుతలను 5 చదరపు కిలోమీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం గల 'బోమా'కు మార్చబడతాయి' అని వన్యప్రాణి సంరక్షక ముఖ్య పాలకుడు జెఎస్ చౌహాన్ శుక్రవారం పీటీఐకి చెప్పారు. ఆషా అనే చిరుత గర్భం దాల్చిందన్న వార్తలపై మాట్లాడుతూ... ఆ విషయం తనకు తెలియదని, అయినా చిరుత యొక్క గర్భధారణ కాలం 90 రోజులని (శనివారంతో చిరుతలు భారతదేశంలో 50 రోజులు పూర్తి చేసుకోనున్నాయి)చెప్పారు. టాస్క్‌ఫోర్స్ ద్వారా అన్ని చిరుతలను దశలవారీగా తరలిస్తారని ఆయన పేర్కొన్నారు. చిరుతలను పర్యవేక్షించడానికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్... వాటిని క్వారంటైన్ జోన్‌ల నుండి దశలవారీగా పెద్ద ఆవరణకు మార్చడానికి సోమవారం ఆమోదం తెలిపింది.

భారీగా పెరిగిన బంగారం- అదే బాటలో వెండి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం బంగారం ధర 10 గ్రాములకు రూ.604 పెరిగి రూ.50,869కి చేరుకుంది. క్రితం ట్రేడింగ్‌లో 10 గ్రాములు రూ.50,265గా ఉంది. వెండి కూడా కిలోకు రూ.2,061 పెరిగి రూ.59,477కి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో, బంగారం ఔన్స్‌కు 1,648 డాలర్లు, వెండి ఔన్స్‌కు 19.81 డాలర్లు పెరిగింది. చైనాలో కొనుగోళ్ల పెరుగుదల మధ్య ఆరు వారాల కనిష్టానికి చేరిన తర్వాత కామెక్స్ బంగారం పెరుగుదల బాగా క్షీణతను నిరోధించడంలో సహాయపడింది"అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లోని రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ చెప్పారు.

కుటుంబ సభ్యులను హత్యచేసి, వ్యక్తి ఆత్మహత్య

జోధ్‌పూర్: తన కుటుంబంలోని నలుగురిని హత్య చేసిన శంకర్‌లాల్(34) ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు శుక్రవారం తెలిపారు. పీల్వా గ్రామానికి చెందిన శంకర్ లాల్ అనే రైతు నల్లమందు బానిస అయ్యాడు. ఈ క్రమంలో శంకర్‌లాల్ పొలంలో పని చేస్తున్న తండ్రి సోనారామ్ (65)ని గొడ్డలితో నరికి చంపి, ఆ తర్వాత అతని తల్లి చంపా (55), కొడుకులు లక్ష్మణ్ (14), దినేష్ (8)లను హత్య చేసినట్టు లోహావత్ ఎస్‌హెచ్‌ఓ బద్రీ ప్రసాద్ తెలిపారు. లాల్ వారి మృతదేహాన్ని తన ఇంటి వద్ద ఉన్న నీటి ట్యాంక్‌లో పడవేసి, సమీపంలోని బంధువుల నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఉన్న ట్యాంక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. లాల్ భార్యకు, ఇంట్లో ఉన్న ఇతర కుటుంబ సభ్యులకు కూడా అక్కడ జరుగుతున్న సంఘటనలు తెలియకపోవటంతో లాల్ తన కుటుంబానికి మత్తుమందు ఇచ్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం ఉదయం మంచినీళ్ల ట్యాంక్ నుంచి మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, సమగ్ర విచారణ ప్రారంభించినట్లు తెలిపారు.

అరెస్టయిన ఇంజినీర్ వద్ద 50క్రిప్టో వాలెట్లు

భువనేశ్వర్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ప్రభుత్వ ఇంజనీర్ వద్ద మరో 50 క్రిప్టో వాలెట్లను అవినీతి నిరోధక శాఖ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. భువనేశ్వర్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ సర్కిల్ పరిధిలోని ప్లానింగ్, మానిటరింగ్, డిజైన్, ఇన్వెస్టిగేషన్ అదనపు చీఫ్ ఇంజనీర్ నిహార్ రంజన్ దాస్‌ను విజిలెన్స్ విభాగం అక్టోబర్ 29న అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై అరెస్టు చేసింది. ప్రత్యేక విజిలెన్స్ కోర్టులో హాజరుపరచగా జైలుకు తరలించారు. మరోవైపు తదుపరి విచారణ నిమిత్తం విజిలెన్స్ అధికారులు అతడిని రిమాండ్‌కు తరలించారు. 'తదుపరి శోధనల సమయంలో, అతని ఇంటి శోధన సమయంలో రికవరీ చేయబడిన 38 క్రిప్టో వాలెట్ల పత్రాలు కాకుండా, వివిధ క్రిప్టో ఎక్స్ఛేంజీలను సంప్రదించడం ద్వారా మరిన్ని ఆధారాలు, మరో 50 క్రిప్టో వాలెట్ల వివరాలు కనుగొన్నాం. ఈ మొత్తం క్రిప్టో వాలెట్ల సంఖ్య వీటితో కలిపి 88కి చేరుకుంది' అని విజిలెన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకు జరిపిన పరిశోధనల్లో, మొత్తం 2 కోట్ల క్రిప్టో ఆస్తులు బయటపడ్డాయి. ప్రభుత్వ సర్వీసు నుంచి పదవీ విరమణకు మూడు రోజుల ముందు అరెస్టయిన దాస్‌ను ఆర్థిక నిపుణులు, సాంకేతిక సిబ్బందితో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. ముంబై నుంచి క్రిప్టో నిపుణుల ప్రత్యేక బృందం భువనేశ్వర్‌లో ఉంది. వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో అతని క్రిప్టో ఆస్తులపై దర్యాప్తు చేయడంలో ఒడిశా విజిలెన్స్‌కు సహాయం చేస్తోంది.

అర్హతలు లేని కంపెనీకి కాంట్రాక్టు ఎలా ఇచ్చారు?

- మరమ్మతుల వివరాలేవి? తీగలను ఎందుకు మార్చలేదు?
- 'మోర్బీ' మున్సిపల్ అధికారికి దర్యాప్తు అధికారి ప్రశ్నలు
- నాలుగు గంటలు సాగిన విచారణ



న్యూఢిల్లీ: అర్హత లేని కంపెనీకి తీగల వంతెన మరమ్మతుల కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? తీగలను ఎందుకు మార్చలేదు? ఒప్పంద పత్రాల్లో మరమ్మతుల గురించి పూర్తి వివరణ ఏది? అంటూ గుజరాత్, మోర్బీ మున్సిపాలిటీ ప్రధానాధికారి (సీఓ) సందీప్‌సిన్హా జాలాపై ప్రశ్నల వర్షాన్ని దర్యాప్తు అధికారులు కురిపించారు. గురువారం దాదాపు నాలుగు గంటలపాటు విచారించారు. వంతెనకు సంబంధించిన పత్రాలు, నిర్వహణ, మరమ్మతుల వివరాలపై దర్యాప్తు అధికారి, డీఎస్పీ పీఏ జాలా ఆరాతీశారు. వంతెన నిర్మాణ స్థిరత్వంపై శాస్త్రీయ అంచనా వేయడంలో మరమ్మతుల కోసం ఒరేవా కంపెనీ ఆశ్రయించిన తండ్రీకొడుకులు దేవాగ్‌భాయి ప్రకాశ్‌భాయి పర్మార్‌కు చెందిన దేవ్‌ప్రకాశ్ ఫ్యాబ్రికేషన్ లిమిటెడ్ విఫలమైనట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించినట్లు సమాచారం. అర్హులు కాని కాంట్రాక్టర్లకు మరమ్మతుల బాధ్యత ఇచ్చినట్లు ప్రధాన జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్ఎస్ పాంచాల్ అన్నారు. ఒరేవాకు చెందిన ఇద్దరు మేనేజర్లు దీపక్ పారేఖ్, దినేశ్ దవేకు కాంట్రాక్టర్ల పనిని పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించారు. పారేఖ్... గ్రాఫిక్ డిజైన్, మీడియా నిర్వహణ బాధ్యతలు చూసుకోగా దవే... కంపెనీ క్లాక్ డివిజన్ నిర్వహిస్తారు. ఇద్దరికీ సాంకేతిక నైపుణ్యత లేదు. వంతెన తీగలకు మరమ్మతులుగానీ వాటిని మార్చడంగానీ జరగలేదు అని పాంచాల్ తెలిపారు. డీఎస్పీ కూడా తీగల గురించి ప్రస్తావించారు. వాటికి మరమ్మతులు జరిగివుంటే ఈ దుర్ఘటన జరిగేదేకాదని అన్నారు. ఒరేవా గ్రూపు కంపెనీతో ఒప్పందం గురించి వివరాలను సీఓ జాలాను అడిగారు. ఎటువంటి అర్హతలు లేకపోయినా కాంట్రాక్టు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. 2007లోనూ ఇదే కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చినట్లు తేలింది. ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం అనుసరించే బిడ్డింగ్ పద్ధతిని ఒరేవాతో ఒప్పందం కోసం మున్సిపల్ యంత్రాంగం విస్మరించినట్లు ప్రముఖ వార్తాసంస్థ నివేదించింది. ఒరేవాతో రూ.29లక్షల కాంట్రాక్టు కేవలం ఒక పేజీలో పూర్తి అయిందని, చేయాల్సిన పనిగురించి వివరణ లేదని డీఎస్పీ అన్నారు. అసలు ఈ కంపెనీలో ఎంతమంది ఉద్యోగులు ఉన్నారు... వారు ఏయే పనులు చేస్తారన్నదీ ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తొమ్మిది మందిని ఈనెల 5వ తేదీ వరకు పోలీసు కస్టడీకి పంపిన విషయం విదితమే. అరెస్టు అయిన వారిలో ఒరేవా మేనేజర్లు ఇద్దరు, పారేఖ్, దవే, ప్రకాశ్‌భాయి, దేవాంగ్‌భాయి పర్మార్ కంపెనీల యజమానులతో పాటు సెక్యూరిటీ గార్డు, టికెట్ బుకింగ్ క్లర్కులు ఉన్నారు. తొలుత ఐపీసీలోని 304 సెక్షన్ కింద కేసు నమోదు కాగా 336, 337 సెక్షన్లను పోలీసులు అదనంగా చేర్చారు. దీనిని ప్రాసిక్యూటర్ పాంచాల్ ధ్రువీకరించారు. 338 సెక్షన్ చేర్పింపు పెండింగ్‌లో ఉంది.

7న వాడవాడలా సభలు

అక్టోబరు సోషలిస్టు విప్లవ దినోత్సవం...

- సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు
- ప్రారంభమైన సమితి సమావేశాలు
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై అజీజ్‌పాషా, రామకృష్ణ నివేదిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్టోబరు సోషలిస్టు విప్లవ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ ఈ నెల 7వ తేదీన వాడవాడలా సభలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి తన శాఖలకు పిలుపునిచ్చింది. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం శుక్రవారం విజయవాడలోని దాసరిభవన్‌లో పి.దుర్గాభవాని అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశం శనివారం కూడా కొనసాగుతుంది. తొలిరోజు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై నివేదిక ఇచ్చారు. గత నెలలో విజయవాడలో అత్యంత ఘనంగా జరిగిన సీపీఐ 24వ జాతీయ మహాసభల మహా ప్రదర్శన, బహిరంగసభ, ప్రతినిధుల సభల జయప్రదానికి తోడ్పడిన వారికి పేరుపేరునా అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో పార్టీ చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలను, కర్తవాలను నిర్దేశించారు. అనంతరం సమావేశం ఈ నెల 7వ తేదీన అక్టోబరు సోషలిస్టు విప్లవ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ సభలను నిర్వహించాలని తన శాఖలను కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించింది. సోషలిస్టు విప్లవ దినోత్సవ ప్రాధాన్యతను వివరించింది. 1917 అక్టోబర్ 17 (కొత్త క్యాలెండర్ ప్రకారం నవంబర్ 7న) జాతుల చెరసాల వంటి జారుల రష్యాను కూల్చి నూతన సోషలిస్టు వ్యవస్థను లెనిన్ అధ్వర్యంలో విప్లవం ద్వారా స్థాపించారనీ, ఈ విప్లవం ప్రపంచ స్వరూప స్వభావాన్ని మార్చివేసిందని సమావేశం గుర్తుచేసింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో గుబులు పుట్టించి దేశంతోపాటు చాలా దేశాల్లో విముక్తి ఉద్యమాలకు, స్వాతంత్రోద్యమాలకు ఉత్తేజాన్ని ఇచ్చిందని ఆ తీర్మానం పేర్కొంది. దేశం స్వావలంబన దిశగా ప్రయాణించడానికి అనేక విధాలుగా సోవియట్ సోషలిస్టు విప్లవం ఆదుకుందని తెలిపింది. దేశం ఇబ్బందుల్లో పడిన సమయాల్లో సైనిక పాటవాన్ని అందించిందని, చాలా దేశాల్లో దేశభక్తియుత శక్తులకు ప్రేరణగా సోషలిస్టు విప్లవం నిలిచిందని పేర్కొంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు పాలక ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని, పెట్టుబడిదారీ విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు, దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయని తెలిపింది. ఈ స్థితిలో సోషలిజమే సమస్యలకు సరైన పరిష్కారమని, దీనికి ప్రత్యామ్నాయం లేదని ఎలుగెత్తి చాటడానికి ఈనెల 7వ తేదీన అన్ని ప్రాంతాల్లో సోషలిస్టు విప్లవ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ సభలను నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి తన శాఖలను కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించింది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో దొంగ ఓట్లు

అరికట్టాలని సీఈవోకు శ్రీనివాసరావు, జల్లి విల్సన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విమర్శించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహంతోనే దొంగ ఓట్లు చేర్పిస్తున్నారని, అర్హత లేకపోయినా ఓటు హక్కు కల్పించాలని స్వయంగా మంత్రులే ఆదేశాలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. దొంగ ఓట్ల చేర్పింపులను అరికట్టాలని, సరైన సమయంలో నిర్ణయం తీసుకోకపోతే ఎన్నికల వ్యవస్థపై దుష్ప్రభావం పడుతుందని నాయకులు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సీఈవో ముకేష్‌కుమార్ మీనాను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి ఎన్నికల అక్రమాలపై వారు శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు, జల్లి విల్సన్ మీడియాతో మాట్లాడారు. అక్రమాలకు సహకరించకపోవడంతో నెల్లూరు, అనంతపురం డీఈవోలను బదిలీ చేశారని, ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని వారు అన్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని వారి బదిలీలను వెంటనే ఆపాలని డిమాండు చేశారు. ఏ మాత్రం అర్హతలేని, ఉపాధ్యాయులు కాని వారిని ఓటర్లుగా చేర్పిస్తున్నారని వివరించారు. కాదంటే మంత్రులే బెదిరింపులకు దిగుతున్నారన్నారు. సర్వే పేరుతో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నవారినే ఓటర్లుగా చేర్పిస్తున్నారని, వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న కొద్దిమందిని టీచర్లుగా చూపించి... సంతకాలు చేయాలని డీఈవోలపై ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వాటిని వెంటనే నిరోధించాలని, లేకుంటే ఎన్నికల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నకిలీ ఓటర్లను వెంటనే తొలగించాలని కోరారు.

సీఈసీ దృష్టికి తీసుకెళ్లాం: మీనా: దొంగ ఓట్ల చేర్పింపు పరిణామాలపై కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశామని సీఈవో ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. డీఈవోల బదిలీలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపైనా మరో లేఖ రాశామని చెప్పారు. సీఈసీ నుంచి వచ్చే ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గవర్నరు నోటిఫికేషన్ చట్ట విరుద్ధం

కేరళ యూనివర్సిటీ సెనేట్ తీర్మానం

తిరువనంతపురం: ఓవైపు కేరళ గవర్నరు ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, వామపక్ష ప్రభుత్వం మధ్య ఘర్షణ వాతావరణం పెరుగుతుంటే...కేరళ యూనివర్సిటీ సెనేట్ కూడా గవర్నరు నిర్ణయాలు, చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వైస్ చాన్సలర్ల ఎంపికకు సంబంధించి సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తూ గవర్నరు జారీ చేసిన నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా కేరళ యూనివర్సిటీ సెనేట్ శుక్రవారం ఏకంగా ఓ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. గవర్నరు విడుదల చేసిన నోటిఫికేషన్ చట్టానికి వ్యతిరేకమైనదని స్పష్టంచేసింది. తమ తీర్మానం గవర్నరుకు వ్యతిరేకం కాదని, ఆయన ఆగస్టులో జారీ చేసిన నోటిఫికేషన్‌కు వ్యతిరేకమని సమావేశంలో పాల్గొన్న సెనేట్ సభ్యులు పేర్కొన్నారు.

ప్రజలే జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుతారు

నందిగామలో చంద్రబాబు

విశాలాంధ్ర-నందిగామ/నందిగామ రూరల్: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం నందిగామలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధ్వర్యంలో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వర రావు, కొల్లు రవీంద్ర తదితరులతో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. స్థానిక గాంధీ సెంటర్లో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ... తాము ర్యాలీగా నందిగామ వస్తుంటే వైసీపీ గుండాలు రాళు విసిరేశారని, భద్రతాధికారికి గాయాలయ్యాని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రాత్రి చింతకాయల అయ్యన్నపాత్రుని అక్రమంగా అరెస్టు చేశారనీ, జగన్మోహన్ రెడ్డి నీ ఆటలు ఇంకా సాగవు నిన్ను సాగనంపుతామని చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకోడానికి యువతే భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావాలనీ ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీ జెండా పట్టి రాష్ట్ర అభివృద్ధికి కదం తొక్కాలని సూచించారు. జగన్ రెడ్డి దుర్మార్గపు పాలనలో యువతకు భవిష్యత్తు లేకుండా పోయిందని, ఇలాగే కొనసాగితే రాష్ట్రం నాశనం అవుతుందన్నారు. నవరత్నాలు కాదు... నవ ద్రోహరత్నాలని చెప్పారు. టీడీపీ ఎక్కడ సభ పెట్టినా జనం బ్రహ్మరథం పడుతున్నారనీ ఇంతకుముందెన్నడూ నందిగామ యువతలో ఇంత ఉత్సాహం చూడలేదని చెప్పారు. కోడి కత్తి డ్రామా నాయకుడు, బాబాయ్ హత్యను గుండె పోటుగా చిత్రీకరించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ఉచితంగా వచ్చే ఇసుకను రూ. 5వేల నుంచి రూ.10వేలకు చేసిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. రాష్ట్రంలో ఇసుకను దోచుకుంటున్నారని, కొండలు కరిగిపోతున్నాయని ఇటువంటి స్కాములు చేసిన ఎవరిని వదిలిపెట్టేది లేదని అన్నారు. జగన్ రెడ్డి బ్రాండ్ మద్యం తో రాష్ట్రంలో ప్రజలు అనారోగ్యం పాలవుతుండగా జగన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లే ఆదాయం అంతా అంతా కాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు, గ్యాస్, ఆర్టీసీ, కరెంట్ చార్జీలను భారీగా పెంచిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని, పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి వైసీపీ నాయకులు అమ్ముకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. వైఎస్ జగన్ అసమర్థ పరిపాలన వల్ల వల్ల సామాన్య కుటుంబాలపై సంవత్సరానికి లక్ష రూపాయల భారం పడుతోందనీ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయటమే కాకుండా రాష్ట్రంలో ఉన్న ప్రజలను కూడా అప్పులపాలు చేయడం జగన్ రెడ్డి పాలనకు నిదర్శనమని అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం జగన్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సీబీసీఐడీ అరెస్టులు చేయటం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు భయం గుప్పెట్లో బతుకుతున్నారన్నారు. పోలీసులకు కూడా దొంగల మాదిరిగా గోడ దూకడం కూడా అలవాట యిందనీ ఎద్దేవా చేశారు. ఇలాంటి దౌర్భాగ్యపు పరిపాలన ఎన్నడూ చూడలేదనీ, అప్రజాస్వామ్యంగా పనిచేసే ఎవరిని వదిలిపెట్టనని, వైయస్సార్ పార్టీ చేసే అవినీతి అక్రమాలకు పోలీసులు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు రక్షణ కావాలన్నా, హైదరాబాదు లాగా రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నా తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడాలన్నారు. ఆ బాధ్యత పూర్తిగా మీదేనంటూ ప్రజలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. మూడున్నర సంవత్సరాలు అవుతున్నా వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని ప్రశ్నించారు. చిన్నచిన్న ఉద్యోగాలకు యువత పక్క రాష్ట్రాలకు పరిగెడుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు రాష్ట్ర యువత రోడ్డు మీదకి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేసులు పెడతారని భయపడి, ప్రశ్నించే హక్కు కోల్పోవద్దని ప్రజలకు సూచించారు.

విజయ్ దేవరకొండ 'ఖుషి' విడుదల వాయిదా

హైదరాబాద్: సినీ పరిశ్రమలో ఎటువంటి అండదండలు లేకుండా స్వశక్తితో ఎదిగిన నటుడు విజయ్ దేవరకొండ. 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి చిత్రాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. చివరంగా 'లైగర్' లో కనిపించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దారుణంగా పరాజయం పాలైంది. ప్రస్తుతం 'ఖుషి' చిత్రంలో నటిస్తున్నాడు. సమంత హీరోయిన్‌గా నటిస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నాడు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాడు. 'ఖుషి'ని క్రిస్మస్ కానుకగా డిసెంబర్‌లో విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. కానీ, అనివార్య కారణాల వల్ల ఈ చిత్రం షూటింగ్ కొనసాగడం లేదు. దీంతో సినిమా విడుదల వాయిదా పడిందని కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. తాజాగా విజయ్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. అందులో భాగంగా చిత్రం విడుదల వాయిదా పడిందన్నారు. అనేక కారణాల వల్ల సినిమా విడుదలను వచ్చే ఏడాదికి వాయిదా వేయాల్సి వచ్చిందని చెప్పాడు. ఈ సినిమాలో జయరాం, సచిన్ ఖడ్డేకర్, మురళి శర్మ, వెన్నెల కిశోర్, లక్ష్మీ, రోహిణి, అలీ, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



అగ్ర నిర్మాతతో సుకుమార్ సినిమా?

హైదరాబాద్: టాలీవుడ్ టాప్ డైరెక్టర్ సుకుమార్, బాలీవుడ్‌పై తరచు విమర్శలు గుప్పించే దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి, తెలుగు నిర్మాత అభిషేక్ అగర్వాల్ ఓ ప్రాజెక్ట్ కోసం కలసి పనిచేయనున్నారని తెలుస్తోంది. తాజాగా ఈ ముగ్గురు సమావేశమయ్యారు. అందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలు బయటికి రాలేదు. సుకుమార్ పుష్ప సినిమాతో దేశవ్యాప్తంగా క్రేజ్‌ను సంపాదించుకున్నాడు. వివేక్ అగ్నిహోత్రి 'ది కశ్మీర్ ఫైల్స్'తో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారిపోయాడు. తెలుగు నిర్మాత అభిషేక్ అగర్వాలే 'ది కశ్మీర్ ఫైల్స్' ను నిర్మించాడు. ఈ సినిమా ఇచ్చిన జోష్‌తో 'కార్తికేయ 2' ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చాడు. ఈ చిత్రాలు మంచి విజయం సాధించడంతో మరో పాన్ ఇండియా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాలని అభిషేక్ భావించాడు. సినిమాకు డైరెక్టర్‌ను ఎంపిక చేసే పనిలో పడ్డాడు. ఇద్దరి డైరెక్టర్స్‌తో టచ్‌లోకి వెళ్లాడు. అభిషేక్ అగర్వాల్‌కు వివేక్ అగ్నిహోత్రితో మంచి సాన్నిహిత్యం ఉంది. టాలీవుడ్ నిర్మాత కావడంతో డైరెక్టర్ సుకుమార్ ఎప్పటి నుంచో తెలుసు. తాజాగా ఈ ముగ్గురు సమావేశమై.. ప్రాజెక్ట్‌కు సంబంధించిన విషయాలపై చర్చించారట. ఈ చిత్రానికి ఎవరు కథను అందిస్తారు..? ఎవరు తెరకెక్కిస్తారు..? అనే విషయాలు తెలియాలంటే కొంత కాలం వేచి చూడాల్సిందే.

అమలాపాల్‌కు బాలీవుడ్ చాన్స్

ముంబై: దక్షిణాదిలో అగ్రశ్రేణి హీరోయిన్‌గా కొనసాగుతున్న అమలా పాల్ బాలీవుడ్‌లో కూడా అడుగుపెట్టింది. స్టార్‌హీరో అజయ్ దేవగణ్ నటించే 'భోళ' చిత్రంలో ఆమె అతిథి పాత్ర పోషించనుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా వెల్లడైంది. డిసెంబరు నుంచి ప్రారంభమయ్యే తదుపరి షెడ్యూల్ షూటింగ్‌లో అమలా పాల్ హాజరుకానుంది. దక్షిణాదికి చెందిన అనేకమంది హీరోయిన్లు బాలీవుడ్ చిత్రాల్లో నటించేందుకు అమితాసక్తిని చూపుతున్న విషయం తెలిసిందే. తమన్నా, త్రిష వంటి వారు హిందీ చిత్రాల్లో నటించగా, నయనతార 'జవాన్' చిత్రంలో నటిస్తున్నారు. 'ఫ్యామిలీ మేన్-2' వెబ్ సిరీస్ ద్వారా సమంత బాలీవుడ్‌లో అడుగుపెట్టగా.. ఇపుడు అమలా పాల్ వంతు వచ్చింది. హీరో కార్తీ నటించగా ఘన విజయం సాధించిన 'ఖైదీ' చిత్రాన్ని అజయ్ దేవగణ్ హీరోగా హిందీలోకి 'భోళ' పేరుతో రీమేక్ చేస్తున్నారు. అమలా పాల్ విషయానికి వస్తే.. ఈ మధ్య టాలీవుడ్‌పై హాట్ హాట్ కామెంట్స్ చేసిన ఈ భామ.. కోలీవుడ్‌పై మాత్రం ప్రశంసల వర్షం కురిపించింది.

కూల్చివేతల ప్రభుత్వం కూలిపోతుంది

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కూల్చివేతలతో పాలన ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం కూలిపోయే రోజు ఎంతో దూరం లేదని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. ఇప్పటం వాసులకు జనసేన అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. మనకు అనుకూలంగా ఓటు వేసినవారే మనవాళ్ళు.. ఓటు వేయనివారు శత్రువులు.. వారి పీచమణిచేద్దామని పాలన చేస్తే రాక్షస రాజ్యమే ఆవిష్కృతమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పాలన నూటికి నూరుశాతం మనవారు కాని వారిని 'తొక్కి నార తీయండి ' అనే విధంగా సాగుతోందన్నారు. పాలకులు తమకు ఓటు వేసిన 49.95 శాతం ఓటర్లకు మాత్రమే పాలకులం అని భావిస్తున్నట్లు వారి చర్యలు చూస్తే అర్థమవుతోందన్నారు. ఇప్పటంలో రోడ్డు విస్తరణ పేరుతో సాగుతున్న అరాచకమే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఇప్పటం గ్రామవాసులు జనసేన మద్దతుదారులు కావడం, మార్చి 14న జనసేన ఆవిర్భావ సభకు చోటిచ్చి సహకరించడమే స్థానిక ప్రజాప్రతినిధి ఆగ్రహానికి కారణం. అమరావతిలోనే ఆవిర్భావ సభ జరపాలని నిర్ణయించి సభాస్థలి కోసం అన్వేషిస్తున్న తరుణంలో సభకు చోటు ఎక్కడా దొరకకుండా అధికార పార్టీ నేతలు బెదిరింపులు, హెచ్చరికలకు పాల్పడ్డారు. ఇప్పటం వాసులు మాత్రం సభ తమ గ్రామంలో జరుపుకోండని ధైర్యంగా ముందుకు రావడమే నేటి కూల్చివేతలు కారణంగా పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మార్చి 14న సభ జరిగిన తరువాత ఏప్రిల్ నెలలో రోడ్డు విస్తరణ అంటూ నోటీసులు ఇచ్చారు. రహదారికి కాస్త పక్కాగా రాకపోకలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా ఉండే గ్రామం ఇప్పటం. ఈ గ్రామం మీదుగా వాహనాల రాకపోకలు ఉండవు. కానీ ఇప్పటికే ఊరిలో 70 అడుగుల రోడ్డు ఉంది. దీనిని ఇప్పుడు 120 అడుగుల రోడ్డు విస్తరించి గ్రామానికి అదనపు హంగులు తెచ్చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధి ఉవ్విళ్లురుతున్నారు. ఆయన ఉత్సాహానికి కారణం కేవలం కక్ష సాధింపు. ఆ వంకతో తమకు ఓటేయని వారి ఇళ్ల తొలగించాలన్నది వారి ధ్యేయం. కూల్చివేత నోటీసులపై ఊరివారందరూ హైకోర్టును ఆశ్రయించడంతో ఆగమేఘాలమీద శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు. రోడ్డు పక్కనే మంచినీటి ట్యాంక్ ఉంది. దానిని అలానే ఉంచి ట్యాంక్ పక్కన ఉన్న ఇంటిని కూడా కూలగొట్టారు. ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవడానికి వెళ్లిన జన సైనికులు, వీర మహిళలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని.. దుర్మార్గానికి అండగా నిలబడ్డారు. ఇప్పటం గ్రామస్తుల ప్రజా పోరాటానికి, న్యాయ పోరాటానికి జనసేన అండగా నిలబడుతుందని పవన్ ఆ ప్రకటనలో వారికి ధైర్యం చెప్పారు.

సెమీస్‌కు దూసుకెళ్లిన కివీస్

ఐర్లాండ్‌పై 35పరుగుల తేడాతో ఘన విజయం

అడిలైడ్: టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కివీస్ 35 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో 7 పాయింట్లు(మూడు విజయాలు, ఒకటి రద్దు, మరొకటి ఓటమి)తో గ్రూప్-1 టాపర్‌గా నాకౌట్ చేరింది. 2.113 మెరుగైన రన్ రేట్ కారణంగా న్యూజిలాండ్ అగ్రస్థానంలో కొనసాగనున్నది. న్యూజిలాండ్ సెమీస్ బెర్త్ ఖారారు కావడంతో... రెండో సెమీస్ బెర్త్ ఎవరికి దక్కుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ స్థానం కోసం ఆతిథ్య ఆస్ట్రేలియాతో పాటు ఇంగ్లండ్ పోటీపడుతున్నాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్నందున ఇంగ్లండ్‌కే అవకాశాలున్నాయి. న్యూజిలాండ్ బెర్త్ ఖారారైన నేపథ్యంలో ఆస్ట్రేలియాకు గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఆ జట్టు సెమీస్ అవకాశాలు శ్రీలంక విజయంపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో విజయం సాధించినా.. నాకౌట్ చేరే పరిస్థితి లేదు. ఈ మ్యాచ్‌లో ఆసీస్ విజయం సాధిస్తే ఆ జట్టుకు ఏడు పాయింట్లు లభించనున్నాయి. అప్పుడు ఇంగ్లండ్-శ్రీలంక మ్యాచ్ ఫలితం బట్టి ఆసీస్ అవకాశాలుండనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను శ్రీలంక ఓడిస్తేనే ఆస్ట్రేలియా సెమీస్ చేరుతోంది. అలాకాకుండా ఇంగ్లండ్ విజయం సాధిస్తే మాత్రం మెరుగైన రన్‌రేట్ కారణంగా ఆ జట్టే ముందడుగు వేస్తుంది. ఈ క్రమంలోనే శనివారం జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను శ్రీలంక ఓడించాలని ఆసీస్ అభిమానులు కోరుకుంటున్నారు. ఇంగ్లండ్ విజయం సాధిస్తే గ్రూప్-1 నుంచి రెండో జట్టుగా సెమీస్ బెర్త్ ఖారారు చేసుకుంటుంది. అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 100 పరుగులతో విజయం సాధిస్తే ఇంగ్లండ్ 47 పరుగులతో గెలవాల్సి ఉంటుంది.

ఆస్ట్రేలియా 80 పరుగులతో గెలిస్తే ఇంగ్లండ్ 29 పరుగులతో గెలవాలి. అదే ఆస్ట్రేలియా 50 పరుగులతో గెలిస్తే ఇంగ్లండ్ ఒక్క పరుగుతో గెలిచినా సరిపోతుంది. మరోవైపు గ్రూప్-1లో భారత్, సౌతాఫ్రికాకు సెమీస్ చేరే అవకాశాలు ఉండగా.. పాకిస్థాన్, బంగ్లాదేశ్ కూడా పోటీలో ఉన్నాయి. జింబాబ్వేపై భారత్, నెదర్లాండ్స్‌పై సౌతాఫ్రికా గెలిస్తే.. సెమీస్ బెర్త్‌లు ఖారారు చేసుకోనున్నాయి. అలా కాకుండా ఓడితే మాత్రం బంగ్లాదేశ్, పాకిస్థాన్‌కు అవకాశం ఉంటుంది.



ఏషియన్ చాంపియన్‌షిప్‌లో స్క్వాష్ టీంకు బంగారు పతకం

కువైట్: భారత పురుషుల స్క్వాష్ జట్టు చరిత్ర సృష్టించింది. కువైట్‌లో శుక్రవారం జరిగిన మొట్టమొదటి సారిగా ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో ఇంతకుముందు రెండుసార్లు తలపడిన భారత బృందం అద్భుతంగా రాణించినా బంగారు పతకాన్ని దక్కించుకోలేక పోయింది. రెండుసార్లూ రజతంతోనే సరిపెట్టుకుంది. అయితే ఆ ఎదురు చూపులకు నేటితో తెరపడింది. భారత పురుషుల బృందం అద్భుతమైన పోరాట పటిమ కనబరిచి ఏషియన్ చాంపియన్‌షిప్స్‌లో తొలి స్వర్ణాన్ని తన ఖాతాలో వేసుకుంది.

పూల్-ఏలో టాపర్‌గా భారత్

ఈసారి ఎలాగైనా స్వర్ణం సాధించాలన్న కసితో బరిలో దిగిన భారత పురుషుల స్క్వాష్ జట్టు.. ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ సత్తా చాటింది. ఈ క్రమంలోనే వరుసగా ఖతర్, పాకిస్తాన్, కువైట్, సౌత్ కొరియా, చైనీస్ తైపీ జట్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ మ్యాచులన్నింట్లో 3-0తో ఏకపక్షంగా విజయాలు నమోదు చేసి పూల్-ఏ టాపర్‌గా నిలిచింది. చివర్లో మలేషియా జట్టు మాత్రమే భారత్‌కు కొంత పోటీ ఇచ్చింది. సెమీఫైనల్‌లో ఈ జట్టును ఎదుర్కొన్న భారత్ 2-1 తేడాతో విజయం సాధించి ఫైనల్ చేరింది.

ఫైనల్‌లో కూడా అదే జోరు..

ఫైనల్‌లో భారత స్టార్ ఆటగాళ్లు రమిత్ తాండన్, సౌరవ్ ఘోసల్ అదరగొట్టారు. తొలుత కువైట్ ఆటగాడు అలీ అర్మామెజితో తలపడిన రమిత్ తాండన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఈ క్రమంలోనే 11-5, 11-7, 11-4 పాయింట్ల తేడాతో విజయం సాధించి భారత్‌కు ఆధిక్యం అందించాడు. రెండో మ్యాచ్‌లో సౌరవ్ ఘోసల్ విశ్వరూపమే చూపాడు. అమ్మర్ అల్టమిమిపై 11-9, 11-2, 11-3తో విజయం సాధించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.